**భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..**

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 298 శనివారం 22 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00



## పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లపై కమిషన్ నివేదికను ఆమోదించిన కేబినెట్

హైదరాబాద్: గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ శనివారం జీవో ఇవ్వనుంది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ నిన్న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ రేపు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయించనున్నారు. రేపు, ఎల్లుండి జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నాయి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది.

# ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా ప్రపంచానికి చాటాం!

## బీఎస్ఎఫ్ దినోత్సవంలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు

ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బీఎస్ఎఫ్ 61వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని భుజ్‌లోని హరిపార్‌లోని జరిగిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. తొలుత విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 1965లో బీఎస్ఎఫ్ స్థాపించబడిందని%ా%25 బెటాలియన్లతో సరిహద్దు ప్రాంతంలో ప్రారంభమై కాలక్రమేణా విస్తరించినట్లుగా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్ఎఫ్, సైన్యం ధైర్యం కారణంగా పాకిస్థాన్ ఏకపక్ష కాల్పుల విరమణ ప్రకటించిందన్నారు. దీంతో మన దళాల సత్తా ప్రపంచానికి స్పష్టమైందని చెప్పారు. లేకుంటే వాళ్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే వారని తెలిపారు. జైష్-ఎ-మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే-ఎ-తోయిబాకు చెందిన 9 ప్రదేశాల్లో స్థాపించబడిన ప్రధాన కార్యాలయాలు, శిక్షణా శిబిరాలు, లాంచ్ ప్యాడ్‌లను నిర్మూలించారని గుర్తుచేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది



చనిపోయారు. అనంతరం మే 7న భారత ప్రభుత్వం.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో 100 మంది ఉగ్రవాదులు హతమవ్వడమే కాకుండా ఉగ్ర శిబిరాలన్నీ నాశనం అయ్యాయి. అంతేకాకుండా పాక్ వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయి. అనంతరం కాల్పుల విరమణ జరిగింది.



## హైదరాబాద్ చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

బేగంపేట: భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్ తదితరులు ఉన్నారు.



## ఇండస్ట్రీయల్ పాలసీపై కేటీఆర్ అవాస్తవాలు చెప్పారు

హైదరాబాద్ : తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక అరచకానికి పాల్పడిందని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆలోచనలో ఇంకా మార్పు రావడం లేద ని మండిపడ్డారు. ఇండస్ట్రీయల్ పాలసీపై కాంగ్రెస్ ప్రభుత్వం గురించి కేటీఆర్ అవాస్తవాలు చెప్పారని ఫైర్ అయ్యారు. ఇండస్ట్రీయల్ పాలసీపై కేటీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు మంత్రి శ్రీధర్ బాబు.

**బీఆర్ఎస్ హయాంలో జీవోలు..** లీజ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీవోలు తెచ్చారని గుర్తుచేశారు. ఫ్రీ హోల్డ్ భూములకు ఇన్పాక్ట్ ఫీజు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చే ప్రయత్నం చేస్తోందని స్పష్టం చేశారు. కేటీఆర్ చెప్పే 30శాతం భూమి విలువ కాదని... కేవలం కన్వర్షన్ ఫీజు మాత్రమేనని తేల్చిచెప్పారు. ఫ్రీ హోల్డ్‌కు... లీజు భూములకు సంబంధం లేకుండా కేటీఆర్ వ్యా ఖ్యలు చేశారని దుయ్యబట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో తెచ్చిన జీవోలను ఇప్పుడు అమలు చేస్తున్నామని వివరించారు. ఇండస్ట్రీయల్ పాలసీపై కేటీఆర్ వ్యాఖ్యలు అడ్డగోలుగా ఉన్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలని ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహించారు. కన్వర్షన్‌కు... భూమికి లింక్ పెట్టి రాజకీయం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి శ్రీధర్ బాబు.




## ఏ తప్పూ చేయలేదు.. లైడిటెక్టర్ టెస్ట్‌కి రెడీ: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 21: ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతిపై కేటీఆర్ స్పందించారు. ఈరోజు (శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని.. చేసుకుపోనివ్వండన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌లో తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై లై డిటెక్టర్ టెస్ట్‌కు కూడా తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణలో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో జాయింట్ వెంచర్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. తాము మళ్ళీ ప్రభుత్వంలోకి వస్తామని.. అన్ని లెక్కలు తేలుస్తామన్నారు. తనను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదని.. అరెస్ట్ జరగదని ధీమా వ్యక్తం చేశారు. అందులో ఏమీ లేదని రేవంత్‌కు కూడా తెలుసన్నారు. దానం నాగేందర్‌తో రాజీనామా చేపించి.. కడియంను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ గుర్తుపై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి దానం దొరికిపోయారన్నారు. అనర్హత వేటు పడితే ఇజ్జత్ పోతుందని రాజీనామా చూపిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. సాకేంతిక సాకులు చూపి కడియంను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక కంటే ముందే గ్రేటర్ ఎన్నికలొస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఢిల్లీ పేలుడు కేసులో కొనసాగుతున్న...

# ఉగ్ర వేట..!

## జమ్మూ కశ్మీర్‌లో బయటపడ్డ గుట్టు..!

## 'కాశ్మీర్ టైమ్స్' ఆఫీస్లో ఏకే 47 బుల్లెట్లు!!




శ్రీనగర్: ఢిల్లీ కారు పేలుడు ఘటనతో దేశ వ్యాప్తంగా ఉగ్రవేట కొనసాగుతోంది. శ్రీనగర్, జమ్మూ ప్రాంతాల్లో నలుగురు ప్రధాన అనుమానితులను NIA అరెస్ట్ చేసింది. అదేసమయంలో.. జమ్మూ కశ్మీర్‌లోని కశ్మీర్ టైమ్స్ మీడియా సంస్థ కార్యాలయంలో తూటాలు లభ్యమవడం కలకలం రేపుతోంది. నవంబర్ 10న జరిగిన ఢిల్లీ కారు పేలుడు ఘటనతో NIA అధికారులు దేశ వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. ఉగ్ర లింకుల ఆధారంగా ఎక్కడికక్కడ అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే.. మరో నలుగురు ప్రధాన అనుమానితులను NIA అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు అయినవారి సంఖ్య ఆరుకు చేరింది. వీళ్లందర్నీ శ్రీనగర్, జమ్ములో అదుపులోకి తీసుకోగా.. అక్కడి నుంచి తీసుకొచ్చి ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టారు. కస్టడీకి అప్పగించడంతో NIA ప్రధాన కార్యాలయానికి తరలించారు. మరోవైపు.. జమ్మూకశ్మీర్ పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జరిపిన సోదాల్లో జమ్మూలోని కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో ఏకే-47 బుల్లెట్లు దొరికినట్లు పోలీసులు వెల్లడించడం సంచలనం సృష్టించింది. క్యాట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిన్న ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించిన పోలీసులు.. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని ఆమె వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలతోనే సోదాలు చేసినట్లు చెప్పారు. ఆమె కార్యకలాపాలు, సంబంధాలను పరిశీలించడమే దర్యాప్తు లక్ష్యమన్నారు. దేశంతో పాటు జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూలంగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలపై కాశ్మీర్ టైమ్స్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా భాసిన్ పేరును కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. దేశ సార్వభౌమత్వానికి ముప్పుగా ఉన్న ఈ వార్తాపత్రిక సంబంధాలు, కార్యకలాపాలను పరిశీలించడమే ఈ దర్యాప్తు లక్ష్యమని పోలీసువర్గాలు తెలిపాయి. కాశ్మీర్ టైమ్స్.. జమ్మూ కాశ్మీర్‌లోని అత్యంత పురాతనమైన, ప్రముఖ వార్తాపత్రికల్లో ఒకటి. దీనిని వేద్ భాసిన్ 1954లో వారపత్రికగా స్థాపించారు. 1964లో దినపత్రికగా మార్చారు.

కాగా, ఈ దాడులను కాశ్మీర్ టైమ్స్ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. తమ గళాన్ని అణచివేసేందుకే దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నామంటూ ఆరోపణలు చేస్తున్నారని పత్రిక ఎడిటర్లు ప్రబోధ్ జామ్వాల్, అనురాధ భాసిన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'మా కార్యాలయంపై దాడులు, రాష్ట్ర వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలు, మా నోరు మూయించే ప్రయత్నం' అని విమర్శించారు. ప్రభుత్వాన్ని విమర్శించడం అంటే రాష్ట్ర వ్యతిరేకం కాదని, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి బలమైన, ప్రశ్నించే మీడియా అవసరమని పేర్కొన్నారు.

ఇక.. కశ్మీర్ టైమ్స్.. జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రముఖ దినపత్రిక కాగా.. ఆ సంస్థలో సోదాలపై కశ్మీర్ టైమ్స్ సీనియర్ ఎడిటర్లు ఫైర్ అయ్యారు. తమను బెదిరించేందుకు, గళాన్ని అణచివేసేందుకే జమ్మూ పోలీసులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.


# సంపాదకీయం

## అసలు కవిత స్టాండేంటి?

తెలంగాణ రాజకీయాల్లో కవిత అడుగులు ఎటు పడుతున్నాయి? ఆమె ఎలాంటి వ్యూహం ప్రకారం ముందుకు వెళ్తున్నారు? ఇదీ..ఇప్పుడు రాజకీయంగా జరుగుతున్న చర్చ. దీనికి కారణం.. నిన్న మొన్నటి వరకు విమర్శించిన.. తన సోదరుడు, బీఆర్ఎస్ నాయకుడు కేటీఆ ర్‌ను ఆమె తాజాగా సమర్థించుకున్నారు. కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఆయనపై కేసు నమోదు చేసి.. విచారణ పేరుతో అరెస్టు చేసే అవకాశం ఏర్పడింది. అయితే.. ఈ పరిణామాలను కవిత తప్పుబట్టారు. కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడం వెనుక బీజేపీ ఉందని కవిత వ్యాఖ్యానించారు. బీజేపీ చెప్పినట్టే కాంగ్రెస్ ఆడుతోందని అన్నారు. అంతేకాదు.. ప్రత్యర్థులపై కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పనిలేదని విమర్శించారు. ఇది కేవలం రాజకీయ కుట్రలో భాగమేనని కవిత చెప్పారు.

**ఏం జరిగింది...** బీఆర్ ఎస్ హయాంలో తెలంగాణలో నిర్వహించిన (హైదరాబాద్) ఈ ఫార్ములా కార్ రేస్‌లో అక్రమాలు జరిగాయని.. ప్రస్తుత ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. జీహెచ్ ఎంసీ నిధులను అప్పటి మంత్రి కేటీఆర్ దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణకు ఆదేశించిన రేవంత్ రెడ్డి సర్కారు.. కేటీఆర్‌ను కూడా కేసులో భాగం చేసింది. దీంతో ఆయనను విచారించేందుకు.. ఏసీబీ ప్రయత్నించింది. కానీ, మాజీ మంత్రి కావడంతో గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి వచ్చింది. అయితే.. సుదీర్ఘకాలంగా ఈ విషయాన్ని పెండింగులో పెట్టిన రాజ్ భవన్ తాజాగా అనుమతి ఇచ్చింది. దీంతో కేటీఆర్‌ను విచారించేందుకు, అవసరమైతే.. అరెస్టు కూడా చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. కేటీఆర్ సోదరి, ఎమ్మెల్సీ కవిత ఫైరయ్యారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఉద్దేశ పూర్వకంగా వేధిస్తున్నాయని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బస్తీల్లో ప్రజల ముఖం చూసే ధైర్యం కూడా అధికార పార్టీ నేతలకు లేదన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రత్యర్థులపై కేసులు పెడుతోందన్నారు.

**కవిత స్టాండ్ ఏంటి?..** ఈ పరిణామంతో అసలు కవిత స్టాండ్ ఏంటి? అనేది రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చింది. ఎందుకంటే. జూబ్లీహిల్స్‌లో బీఆర్ ఎస్ ఓడిపోయినప్పుడు.. కర్మ హిట్స్ బ్యాక్ అని కామెంటు చేశారు. తర్వాత.. కేటీఆర్ సోషల్ మీడియా రాజకీయాలకు పరిమితమయ్యారని దెప్పిపొడిచారు. ఆమె చేపట్టిన జాగృతి జనం బాటలోనూ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ, అనూహ్యంగా ఇప్పుడు అన్నను వెనుకేసుకు వచ్చేలా మాట్లాడారు. ఈ పరిణామాలు చూస్తే.. మాలో మేం ఏమైనా అనుకుంటాం. మేమంతా ఒక్కటే.. ఇంకెవరూ మాజోలికి రాకూడదు అనే స్టాండ్ తీసుకున్నారా? అనే చర్చ జరుగుతోంది.



## పదవులు మరింత బాధ్యతను పెంచుతాయి....

### బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగరి హృదయ్ కుమార్ తో పాటు కార్యవర్గ సభ్యులును అభినందించిన ఎంపీ ఈటెల రాజేందర్.

శామీర్పేట (గరుడ వార్త): పదవులు మరింత బాధ్యతను పెంచుతాయన్న వాస్తవాన్ని విస్మరించొద్దని, అదేవిధంగా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. వరుసగా రెండోసారి రూరల్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నిమతులైన వంగరి హృదయ్ కుమార్ తో పాటు నూతనంగా ఏర్పాటు అయిన కార్యవర్గం సభ్యులు ఎంపీ ఈటెల రాజేందర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు రాజేందర్ వారందరికీ శాలువాతో సత్కరించారు. ప్రజల్లో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులతో పాటు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి





శామీర్ పేట, నవంబర్ 21 (గరుడ వార్త) : రైతుల కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సుగుణాబాయి, జిల్లా డిఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా డిసిఓ వెంకట్ రెడ్డిలు అధికారులతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం పనితీరును వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కొనుగోలు కేంద్రంలో మీకేమైన ఇబ్బందులు ఉన్నాయా అని వారు రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి వరిధాన్యాన్ని తడి, తాలు, దుమ్ము లేకుండా తూర్పాబట్టి, ఆరబెట్టి తీసుకరావాలని జిల్లా అదనపు కలెక్టర్ విజేయేందర్ రెడ్డి రైతులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత, గన్నిబ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వహాకులను ఆదేశించారు. అలాగే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేయరాదని అదనపు కలెక్టర్ నిర్వహాకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తెస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, తాగు నీటి సౌకరం తప్పని సరిగా ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రం ఇన్చార్జిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలను అన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రహించిన రైతులకు 48 గంటల్లో బ్యాంకు ఖాతలో డబ్బులను జమచేయాలని నిర్వహాకులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కాగా శామీర్ పేట వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తీసుకవస్తున్న రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేసిన సౌకర్యాలపట్ల సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అడిగే వరకు తొక్కిపెట్టుడే..!

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలో భవనాలు, లేఅవుట్ల అనుమతుల్లో కొందరు అధికారుల నుంచి దస్త్రాలు ముందుకు కదలడం లేదు. కొన్ని దరఖాస్తులకు 30 రోజులు దాటినా మోక్షం కలగడం లేదు. రెండు నెలల నుంచి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ కల్పించుకొని 30 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దస్త్రాలపై ఫాలోఅప్ చేయాల్సి వచ్చింది. అత్యధిక గడువును రెండు శాతానికి తగ్గించారు. 5 అంతస్తులకు మించి భవన నిర్మాణాలు, లేఅవుట్లకు సంబంధించి బిల్డ్‌నౌ ద్వారా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో పరిశీలించి అనుమతులు ఇస్తున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో చకచక దరఖాస్తుల క్లియరెన్స్‌లో వేగం పెరుగుతుందని తొలుత ప్రకటించారు. హెచ్ఎండీఏలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్లాన్ల అప్‌లోడ్ ఇతరత్రా దరఖాస్తు ప్రక్రియలో వేగం పెరిగినప్పటికీ...వాటిని పరిశీలించి అనుమతులు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని దరఖాస్తుదారులు వాపోయారు. బిల్డ్‌నౌలో గరిష్ఠంగా 15 రోజుల్లో ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపాలి. కారణాలు ఉంటే పేర్కొనాలి. 30 రోజులు దాటుతున్నా.. చాలా దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు.

**కాళ్లు అరిగేలా తిరిగినా...**

ప్రణాళిక విభాగంలో కొందరు కింది స్థాయి అధికారులు అంతా తామై వ్యవహరిస్తున్నారు. ఏజెంట్లతో కుమ్మక్కై తాము అడిగినంత ఇవ్వకపోతే...కొర్రీలు పెడుతున్నారు. ఇటీవల ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ప్రణాళిక విభాగంలో ఏజెంట్లు తిష్ట వేసి.. అధికారులతో ములాఖత్ అయిన విషయాన్ని గతంలో 'ఈనాడు' వెలుగులోకి తేవడంతో అప్పట్లో ఉన్నతాధికారులు స్పందించారు. రెండు నెలలపాటు ఏజెంట్లు రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వ్యవహారం యథావిధిగా మారింది. అమ్యామ్యాలు ఇవ్వనిదే ఫైళ్లు కదలడం లేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. చివరికి ఉన్నతాధికారులు కల్పించుకునే వరకు దరఖాస్తులను తొక్కిపెడుతున్నారంటే కమీషన్ల పర్వం ఏ స్థాయిలో కొనసాగుతుందో స్పష్టమవుతోంది.

ఈ ఏడాది ఇప్పటివరకు దరఖాస్తులు 5,499

భవన అనుమతుల కోసం వచ్చినవి 2,961

బహుళ అంతస్తుల కోసం 77

ఇందులో నెల రోజులు దాటినవి 3040 శాతం

9 నెలల్లో ఆదాయం రూ.1,225 కోట్లు

## నిబంధనలు తుంగలోకి.. నిర్మాణాలు రోడ్లపైకి

కోరుట్ల : జిల్లాలో టీఎస్‌బీపాస్ నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. భవనాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాల లేఅవుట్ల అనుమతులకు 'టీఎస్‌బీపాస్'ను 2020 నవంబరు నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఈ నిబంధనల ప్రకారం మున్సిపల్ అనుమతులు పొందిన అనంతరం నిర్మాణాలు చేపట్టాలి. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నా.. అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. రద్దీగా ఉండే వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రుల భవన నిర్మాణాలు చేపట్టే ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్‌కు సెట్‌బ్యాక్ స్థలాలు, సెల్లార్‌లకు స్థలాలు విడిచిపెట్టాలి. అలా చేయకుండా.. పైగా రోడ్లపైకి వచ్చేలా భవనాలు నిర్మిస్తున్నా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అటువైపు చూడటం లేదనే ఆరోపణలున్నాయి.

**వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు**పట్టణాల్లో తప్పనిసరిగా 33 అడుగుల వెడల్పుతో కూడిన రోడ్లు ఉండాలి. కొన్ని 60 నుంచి 100 అడుగులు ఉండాలనే నిబంధనలున్నాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపల్‌లో 33 అడుగులు దారులకు విడిచిపెట్టే నిర్మాణాలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. చాలా చోట్ల 18, 21, 24 అడుగుల వెడల్పుతో కూడిన రోడ్లు ఉన్నాయి. నిర్మాణదారులు 33 అడుగుల వెడల్పు స్థలాన్ని రోడ్లకు విడిచిపెడుతున్నట్లు మున్సిపల్ నుంచి అనుమతులు పొంది అనంతరం పాటించటం లేదు.

500-700 చదరపు మీటర్ల స్థలంలో భవనం చుట్టూ 2.5-3.5 మీటర్ల స్థలాన్ని విడిచిపెట్టాలి.

750-1000లోపు చుట్టూ 3-4 మీటర్లు, 1000-1500లోపు 3.5-6 మీటర్లు, 1500-2000లోపు 4-6 మీటర్లు, 2500 చదరపు మీటర్ల కంటె ఎక్కువ స్థలంలో భవనాలు, భవన సముదాయాల నిర్మాణాలు చేపడితే 5-7 మీటర్ల స్థలం వదలాలనే నిబంధనలున్నాయి.

**రెండేళ్లుగా జోరుగా..**

రెండేళ్ల క్రితం వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పలుమార్లు నూతన నిర్మాణాలు పరిశీలించి నిబంధనలు పాటించని కట్టడాలు జిల్లాలో చాలాచోట్ల కూల్చివేశారు. తర్వాత పట్టించుకోకపోవడంతో తిరిగి యథావిధిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. సుమారు 2 ఏళ్ల క్రితం ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోంది. దీంతో రెండేళ్లుగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

## లక్ష్యం దాటింది

అశ్వారావుపేట : అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ మరో మైలురాయిని దాటింది. ఈ ఏడాది తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నుల ఆయిల్‌పామ్ గెలలు గానుగ లక్ష్యాన్ని దాటింది. ఆయిల్ సంవత్సరం మరో ఐదు రోజుల్లో ముగియనున్న తరుణంలో ముందుగానే ఆ లక్ష్యాన్ని అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ చేరుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్‌ఫెడ్ తన లక్ష్యాలను తానే అధిగమిస్తూ ప్రైవేటు పరిశ్రమలకు దీటుగా రైతులకు సేవలందిస్తోంది. 2024-25 ఏడాదికి 90 వేల టన్నుల గెలల గానుగ



ఆడించడం లక్ష్యం కాగా... ఈనెల 26 అర్ధరాత్రికి 1,00,223 టన్నుల గెలలు గానుగ ఆడించారు. నూనె దిగుమతి శాతం 19.50కి పైగా రావడం, లక్ష్యాన్ని మించిన గెలలు గానుగ ఆడటంతో రైతుల ఆనందానికి అవధుల్లేవు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో 2021-22లో 70 వేల లక్ష్యానికి 76 వేలు, 2022-23 70 వేలకు 79 వేలు, 2023-24లో 85 వేలకు 48 వేల టన్నుల గెలలు గానుగ(క్రషింగ్) ఆడించారు. తోటల విస్తీర్ణంతో పాటు దిగుబడులు పెరగటంతో ఇటు అధికారులు, రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ మేనేజర్ నాగబాబుతో మాట్లాడుతూ.. ఈ ఏడాది రైతుల కృషి, నాణ్యమైన గెలలు తీసుకురావడంతోనే లక్ష్యం సాధ్యమైందని స్పష్టం చేశారు.

## గలగలా గోదారి కదిలొచ్చేదెప్పుడో..

దిలావర్‌పూర్: తలాపునే గోదావరి నది ఉంది. ఆ నీటిని అందించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలనుకున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆలోచన.. ఆశయం బాగున్నా పథకం పనులు నేటికీ పూర్తికాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి శివారు ప్రాంతంలోని ఎత్తిపోతల పథకం పనుల తీరిది..

జిల్లాలోని దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల మండలాల్లోని గుట్టమీది గ్రామాల్లోని రైతులు రెండు పంటలకు సాగు నీరు లేక వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారు. ఎత్తిపోతల పథకంద్వారా సాగుకు గోదావరి నీరు వస్తుందని రైతులు భూములు అప్పగించారు. పనుల ఆలస్యంతో పలుచోట్ల ప్రధాన కాలువలు వరద నీటికి ధ్వంసం అవుతున్నాయి.

దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి శివారు ప్రాంతంలో 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించింది. భారాస ప్రభుత్వ హయాంలో కాళేశ్వర ఎత్తిపోతల పథకం పేరిట భూసేకరణ పనులు కొనసాగించింది. 50 వేల ఎకరాలకు నీటిని అందించే ప్రధాన కాలువ పనులు ఇటీవల పూర్తిచేశారు. దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లోని మాడేగాం, కదిలి, కుస్లి, అంజనీతండా, తదితర గుట్టమీది గ్రామాల్లోకి సాగు నీరు అందించేందుకు పలుచోట్ల అండర్‌గ్రౌండ్ టన్నెల్ పనులు పూర్తిచేశారు. పంట పొలాలకు నీరందించే ఉపకాలువల నిర్మాణానికి



భూసేకరణ పూర్తి కాలేదు. ఇది పూర్తయితే సాగునీరు అందనుంది.

వివరాలు ఇలా :

సాగునీటి లక్ష్యం: 50 ఎకరాలు

ప్రాజెక్టు అంచనా వ్యయం : రూ. 736 కోట్లు

ప్రధాన పంపుహౌస్‌లు: 03

ప్రధాన కాలువ పొడవు: 11.8 కి.మీ.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం: ఆనంద్‌రావు, కదిలి రైతు

థగుట్టమీది గ్రామాల్లోని పంట పొలాలకు సాగు నీరందిస్తుందని తమ విలువైన భూములను అప్పగించాం. ఏళ్లు గడిచినా ఇంకా ఎత్తిపోతల పనులు పూర్తి కావడం లేదు. భూగర్భ జలాలు ఎక్కువగా లేకపోవడంతో ఏడాదిలో వానాకాలం పంటతోనే సరిపెట్టుకుంటున్నాం.

ఉప కాలువలు నిర్మిస్తే పనులు పూర్తి: అనిల్, ఈఈ, నీటి పారుదల శాఖ ఎత్తిపోతల పథక ప్రధాన కాలువల పనులు ఇటీవల పూర్తయ్యాయి. భూసేకరణ పూర్తి కాగానే ఉపకాలువల పనులు పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయ్యాయి. డిస్ట్రిబ్యూటరీ కాలువలకు రైతులు సహకరిస్తే త్వరగా పనులు పూర్తవుతాయి.

## ఖాళీ ప్లాట్లు.. బకాయిలు రూ. 3 కోట్లు

ఆదిలాబాద్ : బల్దియాలో 15 వేలకు పైగా ఖాళీ ప్లాట్లకు సంబంధించి వీఎల్‌టీ అసెస్‌మెంట్లు ఉండగా అధికారులు వసూలు చేయకపోవడం, యజమానులు చెల్లించకపోవడంతో బకాయిలు రూ.3 కోట్ల వరకు పేరుకుపోయాయి.

బల్దియాలో ఖాళీ ప్లాట్లపై విధించిన పన్నులు(వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) భారీగా పేరుకుపోతున్నాయి. వీఎల్‌టీ అసెస్‌మెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే తప్ప.. ఇప్పటిదాకా వసూలు చేసిన దాఖలాలు లేవు. దీంతో పట్టణంలో వేలాది ప్లాట్లకు వీఎల్‌టీ బకాయిలు రూ.3 కోట్లకు పేరుకుపోయాయి. నివాస గృహాలు, వ్యాపార సముదాయాలపై ఆస్తి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ఖాళీ ప్లాట్లపై విధించిన పన్నుల వసూళ్లపై మాత్రం దృష్టి సారించడం లేదు. యజమాని పూర్తి వివరాలు అందుబాటులో లేవు. దీంతో వీఎల్‌టీ బకాయిలు వసూలయ్యే పరిస్థితి కనిపించడం లేదు.బల్దియాల ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రభుత్వం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ విధానం తీసుకొచ్చింది. లేఅవుట్‌లో ఖాళీ ప్లాటును కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగానే వీఎల్‌టీ అసెస్‌మెంట్ నెంబరు వస్తుంది. బల్దియాలో నివాస గృహాలకు ఆస్తి పన్ను మాదిరిగా ఖాళీ ప్లాట్లకు సైతం ఆరు నెలలకోసారి వీఎల్‌టీ పడుతుంది. ఈ నెంబరు లేని యజమానులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే బల్దియా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో ప్లాటు కొలతలు నమోదు చేసి జారీ చేస్తారు. కొందరు ప్లాట్ల యజమానులు ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్ తీసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నా బల్దియా అధికారుల విచారణలో అక్కడ ఇల్లు లేదని తేలితే.. ఆ అసెస్‌మెంట్ నెంబర్‌ను వీఎల్‌టీగా మారుస్తారు. ఇలా ఏటా వీఎల్‌టీ అసెస్‌మెంట్లు పెరుగుతున్నా పన్నులు మాత్రం వసూలు కావడం లేదు.ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో..ఇళ్ల స్థలాలకు ఏటా భారీగా డిమాండ్ పెరుగుతుండటంతో చాలా మంది ముందస్తుగా ప్లాట్లు కొనుగోలు చేసి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ జరిగినప్పటి నుంచి వీఎల్టీనమోదవుతుంది. ఖాళీ ప్లాటులో యజమాని ఇంటిని నిర్మించుకోవాలంటే అనుమతి కోసం 'బిల్డ్ నౌ' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ అనుమతి కోసం 15 రకాల ఛార్జీలు చెల్లించాల్సి ఉండగా అందులో వీఎల్‌టీ ఒకటి.. కానీ అది నామమాత్రంగానే ఉంటుంది. బకాయిలను ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో చెల్లించకున్నా భవన నిర్మాణ అనుమతులు పొందుతున్నారు.

# కరువు నేలలో సిరులు కురిసే

సిరిసిల్ల : గ్రామంలో రైతులంతా సంఘటితమై వ్యవసాయంలో మంచి మార్పులు తీసుకురావొచ్చని నిరూపించారు. జిల్లాలోని కోనరావుపేట మండలం మామిడిపల్లి ఎఫ్‌పీవో.. సమష్టి అనే పదానికి ప్రత్యామ్నాయంగా మారింది. ఒకప్పుడు కరవు కాటకాలతో అల్లాడిన ప్రాంతం.. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రాష్ట్రంలోనే మామిడిపల్లి ఎఫ్‌పీవో ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల జర్మనీలో జరిగిన ఆగ్రోటెక్నిక్-2025లో గ్రామ రైతులు పాల్గొన్నారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించి, దిగుబడి పెంచడంలో పాటిస్తున్న అనుభవాలను అక్కడి శాస్త్రవేత్తలతో పంచుకున్నారు.

**25 ఏళ్ల ప్రస్థానం..**

మామిడిపల్లిలో ఆదర్శ రైతు పరస్పర సహకార సంఘం 50 మంది రైతులు, రూ.70 వేల మూలధనం వాటాతో 2000 సంవత్సరంలో ప్రారంభమైంది. సీజన్లకు ముందే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు 2018లో బ్యాంకులో రూ.17 లక్షలతో ఓడీ(ఓవర్‌డ్రాఫ్ట్) కరెంటు ఖాతా తీసుకున్నారు. 2023లో నాబార్డు రూ.5 లక్షలు గ్రాంటు రూపంలో అందించింది. అదే సంవత్సరం సంఘాన్ని ఎఫ్‌పీవోగా ఏర్పాటుచేశారు. ప్రస్తుతం 529 మంది రైతులు సభ్యులుగా ఏర్పడి రెండు సీజన్లకు కలిపి రూ.2 కోట్ల మేరకు లావాదేవీలు జరుపుతున్నారు.

**అమ్మకాలు పూర్తయ్యాకే చెల్లింపు**



వ్యవసాయ సీజన్ల ప్రారంభంలో సంఘం ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు హోల్‌సేల్ ధరలకు కొనుగోలు చేసి సభ్యులకు అందుబాటులో ఉంచుతారు. దీనికి రైతులు ముందస్తుగా పైసా చెల్లించకుండా అవసరమైన ఎరువులు, విత్తనాలు తీసుకెళ్తారు. పంట అమ్మకాలు పూర్తయ్యాక వచ్చి చెల్లిస్తారు. మూడు నెలలలోపు తీసుకున్నవాటికి అయిన సొమ్ముపై రూపాయి వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. వానాకాలం పంటలకు డిసెంబరు 31, యాసంగికి మార్చి 31 లోపు చెల్లించాలి. గడువు దాటాక చెల్లిస్తే నెలనెలా వడ్డీ పెరుగుతుంది.

ఎఫ్‌పీవోకు సేవ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో జర్మనీకి చెందిన ఫ్రాన్ హోఫర్ హెచ్‌హెచ్ఐ సంస్థతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించింది. వీటితో వాతావరణ మార్పులు, చీడపీడల నివారణ, ఎరువుల వినియోగంపై నిరంతరం రైతులకు సూచనలు అందిస్తారు. దీనికి ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అక్రాట్ (యాక్సిలరేటింగ్ క్లైమెట్ రిజిలియంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ) సంస్థలు సహకరిస్తున్నాయి.ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులకు వరి, పత్తి పంటలో పెట్టుబడి ఖర్చులు ఎకరానికి రూ.3 వేల వరకు తగ్గింది. దిగుబడులు పెరిగాయి. వీరి సాగు వివరాలను జర్మనీలో జరిగిన ఆగ్రోటెక్నికలో వివరించారు.

# అడుగు.. వంద శాతం మరుగు


సూర్యాపేట : చెరువులు, కుంటలు, ఖాళీ ప్రదేశాల్లో మల మూత్ర విసర్జన చేస్తుండటంతో వాతావరణం కలుషితం అవుతోంది. వివిధ వ్యాధులు వ్యాపించి మృత్యువాత పడే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో బహిరంగ మల మూత్ర విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చర్యలు తీసుకుంది. ప్రతీ ఇంట్లో ఉపాధి పథకం ద్వారా మరుగుదొడ్డి నిర్మాణం చేసుకున్న వారికి రూ.12 వేల చొప్పున మంజూరు చేస్తోంది. గ్రామాల్లో శత శాతం నిర్మించేందుకు ఈజీఎస్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలు కూడా ఆసక్తి చూపారు. దీంతో పారుశుద్ధ్యం మెరుగుపడి స్వచ్ఛగ్రామాలుగా మారాయి. బుధవారం ప్రపంచ శౌచాలయాల దినోత్సవం సందర్భంగా. ఉమ్మడి జిల్లాలోని పరిస్థితిని పరిశీలించింది.

**నల్గొండకు వందనం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1751 గ్రామ పంచాయతీల్లో 1706 పంచాయతీల్లో వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టుకున్నట్లు ప్రకటించారు. అందులో నల్గొండ జిల్లాలో వంద శాతం పూర్తయింది. మిగతా జిల్లాల్లో త్వరలో ప్రకటించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు పథకం వర్తింపు**

ఇల్లు నిర్మించుకున్న వారికి ఉపాధి హామీ పథకంలో కేంద్రం వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు చేస్తోంది. ఈ పథకం ఇప్పటికీ కొనసాగుతుండగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకూ వర్తించేలా కార్యాచరణ రూపొంది



ంచారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,903 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిర్మించుకుంటే రూ.12వేల చొప్పున మంజూరు చేయనుంది.

**మనమూ మారదాం**

ప్రతి రోజు శౌచాలయంతోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.మలవిసర్జన అనంతరం చేతులు, కాళ్లు సబ్బుతో కాకుండా హ్యాండ్ వాష్ లిక్విడ్ వంటి వాటితో శుభ్రం చేసుకోవాలి. బహిరంగ మలమూత్ర విసర్జన చేయడం మానుకోవాలి.

చిన్నప్పటి నుంచి పిల్లలు మరుదొడ్డి వినియోగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. 0-3 ఏళ్ల పిల్లలకు డైపర్లు వాడిన తరువాత చెత్త తరలించే ట్రాక్టర్లకు అందించాలి.

# గ్యాస్ బండ.. దోపిడే నిండా!



కమాన్‌పూర్ : వంటగ్యాస్ సిలిండర్‌ల సరఫరాలో వసూళ్లకు అదుపు లేకుండా పోతోంది. ఇంటి వద్దకు సిలిండర్ సరఫరా చేసే ఏజెన్సీలు 15 కిలోమీటర్ల పరిధిలో ఉచితంగా.. దాటితే మాత్రమే కొంత రవాణా ఛార్జి తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో 15 కి.మీల పైన, లోపు ఉన్న వసూళ్లు మాత్రం పరిపాటిగా మారింది. బహిరంగంగానే దోపిడి జరుగుతున్నా సంబంధిత ఆయిల్ కంపెనీలు, పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టనట్లు ఉంటున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనే బాదుడు**

జిల్లాలో 2,49,609 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పట్టణాల్లో 40 శాతం, గ్రామాల్లో 60 మేర కనెక్షన్లు ఉంటాయి. రామగుండం నగరపాలక, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలికల్లో వినియోగదారులు అదనంగా డబ్బులు ఇవ్వటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 1.40 లక్షల పైన కనెక్షన్లు ఉండగా.. కొందరు నెలకు, మరికొందరు రెండు, మూడు నెలలకొకసారి గ్యాస్ బుక్ చేసుకుంటారు. రెండు నెలలకైతే రూ.50తో రూ.70లక్షలు వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. ఒక సిలిండర్‌పై గ్యాస్ ఏజెన్సీకి రూ.73.08 వరకు కమీషన్ అందుతోంది. జిల్లాలోని కనెక్షన్లపై రూ.1,82,41,425 డిస్ట్రిబ్యూటర్లకు చేరుతుండగా.. డెలివరీ బాయ్స్ కమీషన్‌గా రూ.30-35 వరకు ఇవాల్సి ఉంటుంది. అయితే నామమాత్రపు కమీషన్లు చెల్లిస్తున్నట్లు తెలిసింది. దీనికి తోడు ఫిర్యాదులు సైతం రాకుండా డెలివరీ బాయ్స్‌పైనే మోపుతున్నారు.

కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం వంట గ్యాస్ సిలిండర్ కోసం డెలివరీ బాయ్‌ను సంప్రదించారు. బుకింగ్ లేదనే కారణంతో రూ.927కి బదులు రూ.1100 వరకు వసూలు చేశాడు.

15 కిలోమీటర్ల వరకు సిలిండర్‌లు ఉచితంగా సరఫరా చేయాల్సి ఉండగా.. కాల్వశ్రీరాంపూర్ నుంచి గంగారం 4 కిలోమీటర్ల దూరానికి రూ.1000 తీసుకుంటున్నారు.

రామగిరి మండలం సెంటినరీకాలనీలో కి.మీ పరిధిలో కూడా ఇంటికి గ్యాస్ సిలిండర్ తీసుకొచ్చినందుకు బాయ్ రూ.60 తీసుకున్నాడు. ప్రశ్నిస్తే రవాణా ఛార్జి అని బదులిచ్చాడు.

**బరువు చూపెట్టాల్సిందే..**

గ్యాస్, జీఎస్టీ, డోర్ డెలివరీ(రవాణా, హమాలీ, నిర్వహణ) తదితర ధరలు కలుపుకొని గృహోపయోగ సిలిండర్ ధర రూ.927 ఉంది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో సిలిండర్ బుక్ చేసుకుంటే బిల్లు వస్తోంది. దాని ఆధారంగా గ్యాస్ ఏజెన్సీలు సరఫరా చేస్తాయి. 15 కి.మీలలోపు ఉచితంగా సరఫరా చేయకపోగా.. డెలవరీ సమయంలో సిలిండర్ బరువు వినియోగదారుడికి చూపించటం లేదు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు**

సిలిండర్ సరఫరా బాయ్స్‌కు అదనంగా డబ్బులు ఇవాల్సిన అవసరం లేదు. ఎవరైనా వినియోగదారుడిని అదనంగా అడిగితే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకుంటాం. 15 కిలోమీటర్లు దాటితే కొంతమొత్తం ఛార్జి చెల్లించాలి. ఈ విషయంపై గ్యాస్ ఏజెన్సీల ముందు ఉండే నంబర్లకు సైతం ఫిర్యాదు చేయవచ్చు.శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి

# నిధులు దోచి.. తప్పులు దాచి




కరీంనగర్ : 2022లో ఓ ప్రజాప్రతినిధి వాహనంలో జిల్లాసుపత్రి నిధుల నుంచే వేర్వేరు సందర్భాల్లో డీజిల్ పోయించారు. ఆ ఏడాది రూ.44,536కు సంబంధించిన బిల్లుల సమర్పణలో ఆసుపత్రి సిబ్బంది జాప్యం చేశారు. అధికారుల వాహనాల్లోనూ అదే ఏడాది డీజిల్ పేరిట రూ.1,18,145లను చెల్లించినట్లు రికార్డుల్లో రాసినా.. వాటి బిల్లును మాత్రం ఇప్పటికీ సమర్పించలేకపోయారు. వ్యక్తుల పేర్లు లేకుండా కొన్నింటికి, వివరాలు లేని అంబులెన్స్‌లకు ఇంధన ఖర్చు రాసేశారు.

అత్యవసర ఖర్చులకు తీసుకోవాల్సిన డబ్బుల విషయంలో అప్పటి పర్యవేక్షణాధికారులు ఇష్టానుసారంగా నగదు డ్రా చేసినట్లు విచారణాధికారులు గుర్తించారు. రూ.5 లక్షలు మించి ఖర్చు చేయకూడదనే చోట అంతకు మంచి వినియోగించినట్లు లెక్కల్లో రాశారు. కాయకల్ప నిధుల నుంచి రూ.1.50 లక్షలకు సంబంధించి డ్రా చేసింది ఎందుకనే వివరాలను రికార్డుల్లో పొందుపర్చలేదు. ఇక కీలకమైన నిధులకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవని దాటవేత ధోరణిని చేతల్లో చూపిస్తున్నారు. 2021 నుంచి 2024 వరకు రూ.24,94,921 ఖర్చులపై పొంతనలేని వివరాలున్నాయి.

జిల్లాసుపత్రి నిధుల అక్రమాల విషయంలో 'అంతా మా ఇష్టమనే' పంథా కనిపిస్తోంది. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ నుంచి వచ్చిన ప్రత్యేక విచారణాధికారుల బృందం విస్తుపోయే విషయాలను కొన్నింటిని గుర్తించింది. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారి నుంచి వివరాలు సేకరించారు. అప్పట్లో తప్పులు చేసిన వారికి రాజకీయంగా ఉన్న అండతోనే ఇలా లెక్కాపత్రం లేని తీరును చేతల్లో చూపించారనే విమర్శలున్నాయి. పైగా ఆడిట్ అధికారులను కూడా మభ్యపెట్టి దోచిన సొమ్ముకు సంబంధించిన అక్రమాలను దాచే ప్రయత్నం చేశారనేది అర్థమవుతోంది.

**ఇప్పుడైనా గుర్తించేనా..?** అసలు ఈ గోల్‌మాల్ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత ఉందనే విషయాన్ని ఇప్పటికైనా విచారణాధికారులు గుర్తించాల్సిన అవసరముంది. ఇందులో సూత్రధారులుగా వ్యవహరించిన వారితోపాటు తప్పుల్లో పాలుపంచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోలేదు. కొందరిని కేవలం బదిలీలతో సరిపెట్టారు. అయితే తరువాత బాధ్యతలు చేపట్టిన వారు కూడా పాత అధికారులకు సహకరిస్తూ వైద్యారోగ్యశాఖల్లోని లొసుగులను మాత్రం బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు అర్థమవుతోంది. దాదాపు మూడేళ్ల వ్యవధిలో 1.25 కోట్ల లెక్కల విషయంలో జరిగిన మతలబులను నిగ్గు తేల్చాల్సిన అవసరముంది. పక్కదారి పట్టాయనే అభియోగాలున్న ఇందులో కొన్నింటికి రసీదులు తర్వాత ఇవ్వగా.. ఇంకొన్ని ఇప్పటికీ అందలేదట.!

# కాల్చొద్దు.. కలియదున్నండి

ముస్తాబాద్ : వానాకాలం వరి కోతలు పూర్తయిన తరువాత రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో సాగునీటి వనరులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో బోరు బావులు, కాలువలు, చెరువుల కింద యాసంగిలో మళ్లీ వరి సాగుకే అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. అయితే కోతలు పూర్తయిన చాలామంది వరి కొయ్యలు ఎండిన తర్వాత కాల్చివేస్తున్నారు. వాటిని అలాగే నేలలో కలియదున్నితే మేలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం 2,44,511 ఎకరాలున్నాయి. ఇందులో గత వానాకాలంలో 2,40,762 ఎకరాల్లో వరి సాగు చేశారు.

కాల్చితే కలిగే నష్టాలు..: పంట పొలాల్లోని మిత్ర పురుగులు, ఎర్రలు చనిపోతాయి. పొలం పైపొర గట్టిగా మారి నీరు భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటుంది. భూమి సహజత్వం కోల్పోయి సూక్ష్మధాతువులు నశిస్తాయి. ఫలితంగా పంట దిగుబడులు తగ్గిపోతాయి. పొగతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.

**ఇలా చేయండి**

వరి కొయ్యలను కాల్చడంతో భూసారం తగ్గిపోతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఎకరాకు(సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) లేదా ఏదైనా కాంప్లెక్స్ ఎరువును వరి కొయ్యలపై చల్లి పొలానికి నీరు పెట్టాలి. ఫలితంగా నేలలో వెంటనే అవి కుళ్లిపోతాయి. లేదా వరి అవశేషాలను రోటవేటర్ ద్వారా మట్టిలో కలియదున్నితే పోషకాలు విడుదలవుతాయి. దీంతో వచ్చే



భాస్వరం పంటకు ఉపయోగకరంగా ఉంటుంది. మట్టిలో జవసత్వం పెరుగుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

**రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**

ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ కొయ్యలను కాల్చవద్దంటూ అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొన్నిచోట్ల కాలుస్తున్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించి వాటిని ఎరువుగా మార్చుకోవాలి. సేంద్రియత పెరిగితే పంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. దిగుబడులు పెరిగి లాభాలు పొందుతారు.అనూష, వ్యవసాయాధికారిణి, ముస్తాబాద్

# దగ్గు.. జలుబు సమేత.. జ్వరాల మోత

నల్గొండ: జిల్లాలో గత వారం రోజులుగా సీజనల్ వ్యాధులతో రోగులు పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడం, ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు మించకపోవడంతో అన్ని వర్గాల వారు వణికిపోతున్నారు.

**ఏయే వ్యాధులంటే:** జ్వరం, జలుబు, దగ్గు, ఆస్తమా, తలనొప్పి, చర్మవ్యాధులు, ముక్కు, చెవిగొంతు వంటి సీజనల్ వ్యాధులతో పాటు బీపీ, చక్కెర వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉన్నారు.



పెరిగిన ఓపీ: 10 ఏళ్లలోపు చిన్నారులతో పాటు 50 ఏళ్లు దాటిన వృద్ధులు ఎక్కువగా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, నకిరేకల్, మర్రిగూడ ఏరియా ఆసుపత్రుల్లో వారం నుంచి ఓపీ 400 నుంచి 600, ఐపీ 70 నుంచి 200 వరకు ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో గతం కంటే 50 శాతం ఓపీ పెరిగిందని వైద్యాధికారులు చెబుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

ప్రస్తుతం జలుబు, దగ్గు, ఆస్తమా, జ్వరం వంటి వ్యాధులతో రోగులు ఎక్కువగా వస్తున్నారు. అన్ని ఆసుత్రుల్లో వైద్యులు, సిబ్బంది సరిపడా ఉన్నారు. అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశాం. మందులు, ఇంజెక్షన్లు సరిపడా ఉన్నాయి.

# ఫిర్యాదులకు యాప్‌సోపాలు

సూర్యాపేట : పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సిటిజన్ బడ్డీ' యాప్ వినియోగం కొరవడింది. అవగాహన లేమి, అధికారుల నిర్లక్ష్యమే ఇందుక్కారణమవుతోంది.

సిటిజన్ బడ్డీ యాప్‌లో నమోదు: యాప్‌ను చరవాణిలోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి నల్గొండ జిల్లా పురపాలక సంఘాల పేరుతో ఈ యాప్ అందుబాటులో ఉంది. ఆయా మున్సిపాలిటీల పరిధిలోని సమస్యలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. పట్టణ పౌరులు తీసుకొచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత విభాగం అధికారికి చేరవేయాలి. పౌరసేవ కేంద్రానికి రావడానికి వీల్లేని ప్రజలకు ఫోన్ నంబరు అందుబాటులో ఉంచాలి. వీటితోపాటు పట్టణంలోని రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, అడ్మినిస్ట్రేషన్, మెప్మా విభాగాలతోపాటు వార్డుల వారీగా అధికారులు, సిబ్బంది ఫోన్‌నంబర్లు ఉంటాయి.




అమలుపై నిర్లక్ష్యం: ఈ యాప్ అమలుకు ప్రతి పురపాలిక కార్యాలయంలో ఒక అధికారి, సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలుకావడం లేదు. ఫిర్యాదుల స్వీకరణకు నియమించిన ఆపరేటర్‌ను ఇతర కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. కొంతమంది ఫిర్యాదు చేసినా వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరోవైపు ప్రచార లోపం నెలకొంది. యాప్‌లో సమస్య నమోదు చేసిన వెంటనే సంబంధిత విభాగాల సిబ్బంది నిర్దిష్ట వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి సమస్యలు పరిష్కారం కావటం లేదు.ఇక నుంచి యాప్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని పురపాలికల కమిషనర్లుకు తెలిపారు.

# పొత్తాల గని.. కొలువుల చుక్కాని

భానుపురి : సూర్యాపేట గ్రంథాలయం నిరుద్యోగులకు కొలువుల బాట పరుస్తోంది. పోటీపరీక్షలకు కావాల్సిన పుస్తకాలు ఉండటంతో ప్రైవేటులో శిక్షణ పొందకుండా ఇక్కడ సాధన చేసి ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఏటా పదుల సంఖ్యలో వివిధ రకాల కొలువులు పొంది ఉన్నతంగా స్థిరపడుతున్నారు. ఇక్కడ వివిధ భాషలకు సంబంధించి మొత్తం 28,676 పుస్తకాలు ఉన్నాయి. పురుషులు, మహిళలు, చిన్నారులు 4,133 మంది సభ్యులు ఉన్నారు. గడచిన మూడేళ్లలో 90 మంది వరకు వివిధ పోటీ పర్క్షిలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించారు.

సభ్యత్వం ఉన్నవారు

పురుషులు 3412

మహిళలు 687

పిల్లలు 34 మూడేళ్లుగా వచ్చి చదువుకున్నా


వి.శ్రవణ్ కుమార్, అనంతారం, పెన్‌పహాడ్ మండలం

సూర్యాపేట గ్రంథాలయంలో 2021 నుంచి మూడేళ్లపాటు అనంతారం నుంచి వచ్చి డీఎస్సీకి సన్నద్ధమయ్యాను. ఇక్కడ పోలీసు, గ్రూప్-1, 2, 3, 4, గురుకుల, ఉపాధ్యాయ కొలువుల సంబంధిత పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు చదివి విజయం సాధించాను. నాతోపాటు ఇంకా 30 మంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. నేను డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించి పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురంలో పనిచేస్తున్నాను.

లైన్‌మెన్ ఉద్యోగం సాధించానుహనీఫ్, సూర్యాపేట 2022 నుంచి వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి ఇక్కడికి వచ్చి పుస్తకాలు చదివాను. 2023లో లైన్‌మెన్ ఉద్యోగం సాధించాను. ఇందుకు జిల్లా గ్రంథాలయంలోని పుస్తకాలు దోహదపడ్డాయి. అన్నిరకాల పోటీ పరీక్షల పుస్తకాలు, ఫ్రీ వైఫైతోపాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. ఇలాంటివి పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోకరంగా ఉంటాయి.

# దళారులెందుకు దండగ

హైదరాబాద్ : చిన్న ఇంటికి పెద్ద మొత్తంలో ఆస్తిపన్ను చెల్లిస్తున్నామంటూ బాధపడే వారికి జీహెచ్ఎంసీ సులువైన పరిష్కారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తీసుకొచ్చింది. దళారులతో పని లేకుండా జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌ను తెరచి.. ఆస్తిపన్ను సవరణకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. మ్యుటేషన్, పన్ను మినహాయింపు, మూతపడ్డ వ్యాపారానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సుల రద్దు వంటి సేవలకు ఆన్‌లైన్ దరఖాస్తు అందుబాటులోకి వచ్చింది. మూడు వారాల కిందట జీహెచ్ఎంసీ ఆన్‌లైన్ అర్జీలను అందుబాటులోకి తీసుకురాగా.. ఇప్పటికే రెండువేలకుపైగా దరఖాస్తులొచ్చాయి.



వ్యాపారం మూతపడితే..: వ్యాపారం మూతబడ్డాక ట్రేడ్ లైసెన్సు రద్దు చేయాలంటే ఇబ్బందులు ఉండేవి. బల్దియా వెబ్‌సైట్‌లో ఈ సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తులు కేంద్ర కార్యాలయానికి చేరుతుండగా.. నేరుగా అధికారులకు చేరేట్లు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నామని ఓ ఉన్నతాధికాతో తెలిపారు.

వివాదాలకు పరిష్కారం

జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను రికార్డుల్లో 19లక్షల ఇళ్లున్నాయి. వాటి నుంచి వసూలవ్వాల్సిన ఆస్తిపన్ను విలువ రూ.2,250 కోట్లు. మొండి బకాయిలు మరో రూ.7వేల కోట్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ఇటీవల ప్రారంభించిన ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం విజయవంతమైతే.. పన్ను వివాదాలు 70శాతం మేర పరిష్కారమవుతాయని అంచనా.

# నిర్మించి.. విస్మరించి

హైదరాబాద్: నగరంలో గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సముదాయాల్లోని ఎస్టీపీలు నిరుపయోగంగా మారాయి. శుద్ధి అయ్యే నీటిని మరుగుదొడ్లు, గార్డెనింగ్, ఫ్లోర్ క్లీనింగ్ వంటి వాటికి వినియోగించుకోవచ్చు. బెంగళూరులో పెద్ద అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధిచేసిన నీటి వినియోగం తప్పనిసరి. మన నగరంలో పరిస్థితి పూర్తి భిన్నం. అసలు ఎస్టీపీలు పనిచేస్తున్నాయా? లేదా? మురుగునీటి శుద్ధిలో పాటిస్తున్న ప్రమాణాలు, పునర్వినియోగం వంటివాటిని



పరిశీలించాల్సి ఉంది. తర్వాత థర్డ్‌పార్టీతో మదింపు చేయాలని జలమండలి నిర్ణయించినా అమలు కాలేదు.

**కారణాలు**శుద్ధి చేసిన నీటిని వినియోగించేందుకు ఆసక్తి చూపకపోవడం.ఎస్టీపీల నిర్వహణ వ్యయం, విద్యుత్ ఛార్జీలు ఎక్కువ అవుతుందనే అభిప్రాయం.బల్క్ కనెక్షన్లకు కావాల్సినంత నీటి సరఫరా.

వీటి నిర్వహణ గురించి పట్టించుకునే వ్యవస్థ లేకపోవడం.

# చెరువు శిఖం హాంఫట్

కోరుట్ల :జిల్లావ్యాప్తంగా సుమారు 1,226 చెరువులుండగా సగం మేర కబ్జా కోరల్లో ఉన్నాయి. వాటి చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని సుమారు ఆరేళ్ల కిందట కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక కమిటీ నిర్ణయించింది. ఆ తర్వాత నిధులు లేవని చేతులెత్తేశారు. శిఖం భూమిని ఆనుకొని ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు.

**పల్లెల్లో పంటలు**

గ్రామాల్లో చెరువులు, కుంటలకు నీటిపారుదల శాఖ అధికారులు ఎలాంటి హద్దులు ఏర్పాటు చేయలేదు.

శిఖం భూమి చుట్టూ పట్టా భూములున్న రైతులు కలిపేసుకొని పంటలు సాగు చేస్తున్నారు.

మత్తళ్లను ధ్వంసం చేయడంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండటం లేదు.

కాలువలను చదును చేసి పంటలు సాగు చేస్తున్నారు.



చాలా గ్రామాల్లో చెరువుల ఒడ్డునే పాఠశాలలు, కార్యాలయాలు, రహదారులను నిర్మించడంతో ఆక్రమణకు గురవుతున్నాయి.

పట్టణాల్లో నిర్మాణాలుజగిత్యాల పట్టణం, శివారు గ్రామాల్లో 5 చెరువులుండగా, 4 ఆక్రమణకు గురయ్యాయి.మెట్‌పల్లిలో ఒక చెరువులో ఆక్రమణలు జరగగా నోటీసులు జారీ చేశారు. రెండు కుంటలను మట్టితో పూడ్చివేశారు.రాయికల్‌లో ఒక కుంట ఆక్రమణకు గురైంది. ధర్మపురిలో అయిదు చెరువులుండగా అన్ని చోట్లా కబ్జాల పర్వం సాగింది

బఫర్‌జోన్‌లో నిర్మించిన ఇళ్లకు మున్సిపల్ నుంచి నంబర్లు, కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. విద్యుత్తు మీటర్లు బిగిస్తున్నారు.

నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్థిరాస్తి వ్యాపారులకు వరంగా మారింది.

ఎఫ్‌టీఎల్ భూముల్లోని ఆక్రమణలను తొలగించినా తిరిగి నిర్మాణాలు వెలుస్తున్నాయి.చిత్రంలో కనిపిస్తోంది కోరుట్ల పట్టణ శివారులోని కంచరకుంట. చెరువు పైభాగంలో కొందరు మట్టితో ఎత్తు పెంచి అక్రమంగా షెడ్లు వేసుకున్నారు. చాలా ఏళ్లుగా వినాయక విగ్రహాల తయారీ, ఇతర దుకాణాలు నిర్వహిస్తున్నారు. అక్రమ కట్టడాలను గతంలో పలుమార్లు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించినా పరిస్థితి మొదటికొచ్చింది.

# మహా పోరు.. మాటెత్తని సర్కారు!



హైదరాబాద్ : మహానగరానికి సంబంధించి ప్రస్తుత పాలక మండలి గడువు మరో మూడు నెలల్లో పూర్తవనుండగా ప్రభుత్వం వద్ద ఎలాంటి చర్చ జరగడం లేదు. కాంగ్రెస్ పార్టీలోనూ ఈ ఎన్నికల గురించి మాట్లాడుకోవట్లేదు. అధికార వర్గాలైతే అసలు పట్టించుకోవట్లేదు. ఇదంతా చూస్తే జీహెచ్ఎంసీకి సమీప కాలంలో ఎన్నికలు ఉండవనే సంకేతం వెలువడుతోంది. ఏడాది పాటు ప్రత్యేక కమిషనర్ పాలన కొనసాగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**25న చివరి సమావేశం..**

ప్రస్తుత పాలకమండలికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ నవంబరు 18, 2020న విడుదలైంది. డిసెంబరు 1, 2020న ఎన్నికలు నిర్వహించారు. ఫలితాలు డిసెంబరు 4న వెల్లడయ్యాయి. అప్పటి ప్రభుత్వం ముందస్తుగా ఎన్నికలు నిర్వహించడంతో.. ఎన్నికైన కార్పొరేటర్లు రెండు నెలల తర్వాత ఫిబ్రవరి 11, 2021న ప్రమాణ స్వీకారం చేశారు. వారి ఐదేళ్ల పదవీ కాలం ఫిబ్రవరి 11, 2026తో ముగియనుంది. ఈ నేపథ్యంలో నవంబరు 25న ప్రస్తుత పాలకమండలి సాధారణ సర్వసభ్య సమావేశం జరగనుంది. దాని తర్వాత 2026లో జనవరి 10 నుంచి 20 మధ్య బడ్జెట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**సిద్ధమైన టీసీయూఆర్ పటాలు..**

గ్రేటర్ చుట్టూ 27 స్థానిక సంస్థలను విలీనం చేసి జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. 2వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ప్రాంతాలను టీసీయూఆర్(తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్)గా పేర్కొని సమగ్ర నగరాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని హెచ్ఎండీఏను సీఎం ఆదేశించారు. ఆ మేరకు జలవనరులు, రోడ్డు మార్గాలతో కూడిన పటాలను సిద్ధం చేశారు.


**ప్రత్యేక కమిషనర్ పాలన?**

టీసీయూఆర్‌లోని 27 స్థానిక సంస్థలు ప్రత్యేక కమిషనర్ పాలనలో ఉన్నాయి. జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ముగిశాక ప్రత్యేక కమిషనర్‌ను నియమిస్తారు. అప్పుడు శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసి.. మొత్తం ప్రత్యేక కమిషనర్ పాలన కిందకు తెస్తారు.

**అప్పుడే అసలు పరీక్ష..**

జీహెచ్ఎంసీలో శివారు స్థానిక సంస్థలు విలీనమయ్యాక డివిజన్ల పునర్వ్యవస్థీకరణ మొదలవుతుంది. నగరాన్ని రెండు లేదా మూడు మహానగరపాలక సంస్థలుగా విభజిస్తారు. అప్పటి వరకు ఎన్నికలు ఉండవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# భూమిలో ఏమున్నాయి?



హైదరాబాద్ : సిగ్నళ్లు లేని కూడళ్లే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన హెచ్-సిటీ ప్రాజెక్టు పట్టాలెక్కింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో.. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో పైవంతెనల నిర్మాణానికి ఇంజినీర్లు సిద్ధమయ్యారు. మొదటి దశలో భాగంగా ముఖ్య ఇంజినీరు భాస్కర్‌రెడ్డి.. నగరంలోనే మొదటిసారి జీపీఆర్(గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) సర్వేను ప్రారంభించారు. జీపీఆర్ అధ్యయనంలో భూమిలోని తాగునీటి, మురుగునీటి, వరదనీటి పైపులైన్లు, టెలికాం కేబుళ్లు, ఇతరత్రా అడ్డంకులు ముందే తెలుస్తాయి. గతంలో మాదిరి రోడ్డు పొడవునా గుంతలు తవ్వుకుంటూ.. పైపులైన్ల కోసం నెలల తరబడి అన్వేషించే పరిస్థితి ఉండదు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా.. రోడ్డు తవ్వకం పనులను వేగంగా పూర్తి చేయొచ్చు. ముందస్తు ప్రణాళికతో పైపులైన్లను అంచులకు మార్చే పనులు వేగంగా పూర్తవుతాయి.

**5 మీటర్ల లోతు వరకు..**

వరద నాలాల అధ్యయనం కోసం జీహెచ్ఎంసీ గతంలో జీపీఆర్ అధ్యయనం చేసింది. అందులో సరైన ఫలితాలు రాలేదు. జీహెచ్ఎంసీ ఈసారి ఆధునిక పరికరాలను ఉపయోగిస్తోంది. వాటితో భూగర్భం లోపల 5 మీటర్ల లోతు వరకు భూమిని స్కానింగ్ చేయగలమని ఇంజినీర్లు చెబుతున్నారు.

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. అందుకోసం రహదారులను పెద్దఎత్తున తవ్వాల్సి వస్తుంది. తవ్వకాల సమయంలో పైపులైన్లు అడ్డుపడితే.. నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. ఎల్బీనగర్ కూడలి, నాగోల్ కూడళ్లలో పైవంతెనలు నిర్మించేటప్పుడు.. తాగునీటి పైపులైన్లు అడ్డురావడం వల్ల.. అప్పట్లో ఏడాది పాటు జాప్యం జరిగింది. ఆ సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో.. కొత్త యంత్రాలతో జీపీఆర్ సర్వే చేస్తోంది.

కేబీఆర్ పార్కు చుట్టూ ప్రస్తుతం సర్వే జరుగుతోంది. రోడ్డు కిందనున్న పైపులైన్లు, అవి ఎంత లోతులో ఉన్నాయి, ఇతరత్రా వివరాలను తెలుసుకుని రహదారి అంచులకు మార్చేందుకు ఇంజినీర్లు ప్రణాళిక రూపొందిస్తారు.

పైవంతెనల పిల్లర్ల కోసం భూ పరీక్షలు కూడా మొదలయ్యాయి. పార్కు చుట్టూ, రోడ్డు విభాగినిపై ఉన్న చెట్లను తొలగించే ప్రక్రియ పురోగతిలో ఉందని, అవి పూర్తవగానే పిల్లర్ల నిర్మాణం మొదలవుతుందని ముఖ్య ఇంజినీరు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

# దూది పింజ.. మంచు పంజా!



పరిగి : ఈసారి దూదిపుల సాగు పుట్టెడు దు:ఖాన్ని మిగులుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక అన్నదాతలు సతమతమవుతున్నారు. అప్పులు తీర్చుకునేందుకు వేలాది మంది రైతులు తెల్ల బంగారాన్ని సాగు చేశారు. మొన్నటి వరకు భారీ వర్షాలు వెంటాడాయి. ఇప్పుడిప్పుడే కాస్త విరామం దొరకడంతో జిల్లావ్యాప్తంగా పత్తితీతలు ముమ్మరమయ్యాయి. కూలీల కొరత కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. సరిగా ఇదే సమయంలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏడు క్వింటాళ్ల పరిమితి మరోవైపు వేధిస్తోంది.

**2.54 లక్షల ఎకరాల్లో సాగు..**


వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలో 2,54,605 ఎకరాల్లో 1,41,125 మంది రైతులు పత్తి సాగు చేశారు. కర్నూల్, అనంతపూర్ ప్రాంతాల నుంచి కొందరు రైతులు కూలీలను మాట్లాడుకొని తెచ్చుకున్నారు. పొలాలకు వెళ్లి చూస్తే చలి, మంచు ప్రభావంతో పత్తి తడిసి ముద్దవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పత్తితీత పనులు ఆపేసి వేచిచూసే ధోరణి అవలంభిస్తున్నారు. భారీ వర్షాలతో జిల్లాలో 5,448 ఎకరాలకుపైగా పంట నష్టం వాటిల్లింది.

**నిబంధనలు ఇలా..**

పొడవు రకం పింజకు మద్దతు ధర క్వింటాకు రూ.7521, మధ్య రకం రూ.7121గా ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనల మేరకు 8- 10 శాతం తేమ కలిగిన పత్తికి మద్దతు ధర లభిస్తోంది. వారం, పది రోజులుగా చలి పెరిగి మంచు కురుస్తున్న కారణంగా 18- 20 శాతానికి పెరుగుతోందని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో చాలా మంది రైతులు చలి తీవ్రత తగ్గాకే పొలాల నుంచి తీద్దామని భావిస్తున్నారు. ఇప్పటికే తీసిన కొందరు రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకెళితే తిప్పి పంపారు.

**సడలింపుతోనే మేలు..**-వెంకటయ్య, రైతు, మంచన్‌పల్లి, పూడూరు మండలంమూడెకరాల్లో పంట వేశా. ప్రభుత్వం పత్తి విక్రయాల్లో నిబంధనలు సడలిస్తేనే మేలు. వర్షాలకు దిగుబడులపై ప్రభావం పడింది. అమ్ముకుందామంటే తేమ శాతం కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. మంచుకు పత్తి తడుస్తోంది. ఈ కారణంగానే మరో వారం రోజులపాటు పొలం నుంచి తీయకుండా ఉండాల్సి వస్తోంది. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి.

# సైబర్ కేసుల పరిష్కారం, రీఫండ్‌లో హైదరాబాద్‌దే అగ్రస్థానం



నారాయణగూడ: ప్రత్యేక లోక్ అదాలత్‌లో హైదరాబాద్ కమిషనరేట్ అత్యధికంగా 11,226 కేసులు పరిష్కరించి అన్ని కమిషనరేట్లలో ప్రథమ స్థానంలో నిలిచింది. సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్(సీసీపీఎస్), హైదరాబాద్ నగర జోనల్ సైబర్ సెల్స్ కలిసి 709 కేసులు పరిష్కరించి రూ.5,77,78,601.23 రీఫండ్ డబ్బును బాధితులకు అందించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు అదనపు పోలీసు కమిషనర్(క్రైమ్స్) ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో సీసీపీఎస్ 40 కేసులను కంపౌండ్/కాంప్రమైజ్ చేసి, బాధితులకు రూ.1.98,04,148 మొత్తాన్ని, లోక్ అదాలత్‌కు ముందు సైబర్ పోలీసులు మరో 275 కేసుల్లో రూ.3,07,91,283, జోనల్ సైబర్ సెల్స్ 394 కేసుల్లో రూ.71,83,170 విజయవంతంగా రీఫండ్ చేసినట్లు వివరించారు. డీసీపీ (సైబర్ క్రైమ్స్), హైదరాబాద్ సిటీతో పాటు అన్ని జోనల్ డీసీపీల నిరంతర పర్యవేక్షణ, సమర్థ మార్గదర్శనం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పోలీసు శాఖ హైదరాబాద్ కమిషనరేట్ భవిష్యత్తులో సైబర్ నేరాల దర్యాప్తు వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా త్వరితగతిన న్యాయం అందేలా అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# రక్తశుద్ధి.. ఆరోగ్య సిద్ధి

సిరిసిల్ల : మారుతున్న జీవన శైలితో మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు రోజురోజుకు పెరుగుతున్నారు. క్రమం తప్పకుండా రక్తశుద్ధి చేసుకుంటేనే ప్రాణాలు నిలుస్తాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలో ఒక రక్తశుద్ధి కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. అనువైన ఆసుపత్రుల వివరాలు కోరింది. ప్రస్తుతం కరీంనగర్, పెద్దపల్లి, మంథని, గోదావరిఖని, హుజూరాబాద్, జగిత్యాల, కోరుట్లలోని జిల్లా, జనరల్ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తశుద్ధి సేవలు అందుతున్నాయి. వీటితోపాటు గంభీరావుపేట, మెట్పల్లి, జమ్మికుంటలలో ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలు పంపింది.

ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఒకరికి నాలుగు గంటల చొప్పున స్లాట్ ఉంటుంది. ఇవే కాకుండా కరీంనగర్, జగిత్యాల, ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రక్తశుద్ధి కేంద్రాలున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ వర్తించక చాలా మంది రోగులకు ఉచిత సేవలు అందడంలేదు.

బాధితులకు రక్తశుద్ధి సేవలు అందుబాటులో ఉంచేందుకు కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు బోధనాసుపత్రుల్లోనూ అదనపు పడకలు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో గంభీరావుపేట, మెట్పల్లి, జమ్మికుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను గుర్తించారు. రక్తశుద్ధి కేంద్రంలో 24 గంటల



వైద్యసేవలు అందుబాటులో ఉండాలి. ఎంపిక చేసిన ఆసుపత్రులను 24 గంటల సేవలకు అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది.


రక్తశుద్ధి కేంద్రాల ఏర్పాటుపై రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి పెంచలయ్యతో మాట్లాడగా రక్తశుద్ధి చేసుకునేవారి సంఖ్య పెరగడంతో ప్రభుత్వం కొత్త కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టిందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడు డయాలసిస్ కేంద్రాలు పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు పార్టిసిపేషన్) పద్ధతిలో నిర్వహిస్తున్నారు. వీటిల్లోని 45 పడకల్లో రోజుకు నాలుగు షిఫ్టుల్లో 329 మందికి రక్తశుద్ధి జరుగుతోంది. రాష్ట్రంలో అపెక్స్, సాబ్, డీసీడీసీ అనే మూడు ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీపీపీ పద్ధతిలో సేవలు అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కొత్త కేంద్రాల ఏర్పాటుకు డీసీడీసీ సంస్థ ముందుకొచ్చింది.

# భర్తగా భరిస్తాడు.. తండ్రిగా తరిస్తాడు...

మిర్యాలగూడ : భర్తగా..తండ్రిగా..అన్నగా..తమ్ముడిగా..తాతగా.. కార్యాలయంలో ఉద్యోగిగా.. సరిహద్దులో సైనికుడిగా.. గేటు ముందు రక్షకుడిగా.. సమాజంలో అనేక రకాల బాధ్యతలు నిర్వర్తించే మగాడు.. మగవారి బాధ్యతలు, వారు పడే కష్టాలు, వేదనను ప్రపంచానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో ఏటా నవంబరు 19న 'అంతర్జాతీయ పురుషుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

లింగ సమానత్వం పెరుగుతున్న కొద్దీ.. పురుషుల్లో అనేక మార్పులు వచ్చి మహిళలను తమతో సమానంగా చూస్తున్నారు. కొన్ని మినహాయిస్తే మిగిలిన ఏ రంగంలోనూ.. అంశంలోనూ మహిళలు.. పురుషులకు తీసిపోని విధంగా ఉన్నారు. ఎన్నో కష్టాలను దిగమింగుకొని.. కన్నీళ్లు బయటకు రానీయకుండా.. కుటుంబం కోసం అహర్నిశలు కృషి చేసే మగవారు సమాజంలో చాలా మంది ఉన్నారు. కొందరు మృగాళ్లు చేసే నేరాలను.. పురుష జాతి మొత్తానికి అంటగడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం కుటుంబం కోసం తపించే పురుషులు ఎందరో ఉన్నారు.

కుమారుడిగా జన్మనిచ్చిన తల్లికే మొదటి ఓటు వేయాలి కానీ.. భర్తగా భార్యను ఓదార్చాల్సిన, ఒప్పించాల్సి బాధ్యత పురుషుడిదే. అన్నలా.. కుటుంబానికి అండగా నిలవాలి. తమ్ముడిలా అన్ని బాధ్యతలు చేపట్టాలి. తండ్రిగా పిల్లల ఉన్నతికి కృషి చేయాలి. తాతగా ఇంటిల్లిపాదికి ఆదర్శంగా నిలవాలి. ఉద్యోగిగా ఎలాంటి ఆశలకు లొంగకుండా కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలి. ప్రజా ప్రతినిధిగా తన స్వార్థం కోసం కాకుండా.. ప్రజల సంక్షేమం కోసం పాటు పడాలి. రైతుగా ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. సైనికుడిగా ప్రజలకు



భయం లేని రక్షణ ఇవ్వాలి.

ఉమ్మడి జిల్లా వివరాలు.. (సుమారు..లక్షల్లో)

పురుష ఓటర్లు: 14.63

యువత: 8.5

పిల్లలు: 5.80

వృద్ధులు: 3.5

పురుషుడికి తగిన ప్రాధాన్యం దక్కాల్సిందే

చారుగుండ్ల రాజశేఖర్, సైకాలజిస్టు, కోదాడ

నాటి నేటి పరిస్థితుల్లో ఎంతో తేడా వస్తున్నందున మగవారికి సైతం తగిన ప్రాధాన్యం దక్కాల్సిందే. తల్లి ప్రేమ ముందు..తండ్రి బాధ్యత చిన్నబోతుంది.. అనే నానుడి ప్రకారమే మగాడు ఎంత కష్టపడినా..అది చిన్నదిగానే కనిపిస్తుంది. ఓర్పుకు మారు పేరు, మార్పుకు మార్గదర్శి మగాడు. పిల్లల జీవితానికి దృఢమైన పునాది వేసే నాన్న కూడా ఓ మగాడే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. పురుషుల రక్షణకు సైతం ప్రత్యేక చట్టాలు రావాల్సిన అవసరముంది.

## విద్యుత్తుతో పరుగులు.. కాలుష్య నియంత్రణకు అడుగులు

హైదరాబాద్: విద్యుత్తుతో నడిచే మెట్రోరైలు కిలోమీటర్ దూరానికి 10 యూనిట్లు మాత్రమే వినియోగిస్తుంది. ఎల్బీనగర్ నుంచి మియాపూర్ 29 కిలోమీటర్ల మార్గంలో ఒక ట్రిప్ దూరానికి 290 యూనిట్ల విద్యుత్తుతో.. ఏకంగా వెయ్యి మందిని గమ్యస్థానానికి చేర్చవచ్చు. ఆ విధంగా ఇంధన పొదుపులో హైదరాబాద్ మెట్రో ఇతర రవాణా సాధనాలతో పోలిస్తే కాలుష్య నివారణలో కీలకంగా మారింది. నగర కాలుష్యంలో 70 శాతం వాహనాల నుంచి వెలువడుతోంది. మెట్రోరైలును అన్ని ప్రాంతాలకు విస్తరణతో వాహన కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉందని రవాణారంగ నిపుణులు చెబుతున్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో... 2024-25 ఆర్థిక సంవత్సరంలో 38 మిలియన్ లీటర్ల ఇంధనాన్ని ఆదా చేసింది. సుమారు 109 మిలియన్ కిలోల కార్బన్ డై యాక్సైడ్‌ను నిలువరించింది.

45 మిలియన్ యూనిట్ల వరకు..ఇప్పుడున్న 69 కి.మీ. మెట్రో మార్గంలో రోజూ 1100 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఐదు లక్షల



మందిని రోజూ గమ్యస్థానం చేరుస్తోంది. సగటున 25వేల కిలోమీటర్లు మెట్రోరైలు నిత్యం నడుస్తోంది. ఇందుకు 2.5 లక్షల యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తోంది.

**40 శాతం ఆదా ఇలా..**

రైలు బ్రేక్ వేసినప్పుడు 40 శాతం వరకు ఉత్పత్తి అయ్యే విద్యుత్తును తిరిగి వినియోగించుకునే వ్యవస్థతో గణనీయంగా ఇంధనం ఆదా అవుతోంది. 45 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఈ విధానంలో ఆదా చేసింది.

పలకల ఏర్పాటు..

మెట్రోరైలు 2 డిపోలు, 41 స్టేషన్లపై సౌర విద్యుత్తు పలకలు ఏర్పాటు చేశారు. వీటి మొత్తం సామర్థ్యం 11 మెగావాట్ల వరకు ఉంది. మెట్రోరైలు విద్యుత్తు అవసరాల్లో 12 శాతం సౌర విద్యుత్తు సమకూరుస్తోంది.

## బండి రాదని.. బండబాదుడు..!

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో గ్యాస్ అయిపోయింది. వెంటనే బుక్ చేసుకుని రోజంతా ఎదురు చూశారు. డెలివరీ బాయ్‌కు ఫోన్ చేయగా..తను సెలవులో ఉన్నానని చెప్పాడు. ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేయగా..ఒక రోజు ఆగాలని, లేదంటే బయట దుకాణాల వద్ద కొనుగోలు చేసుకోవాలని ఆయనే అడ్రస్ చెప్పడం గమనార్హం. దీంతో విధిలేక ఆ ఉద్యోగి రూ.1100 చెల్లించి బయట కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది.

నిత్యావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లు జిల్లాలో పక్కదారి పడుతున్నాయి. బుక్ చేసుకున్న వారి ఇళ్లకు ప్రతి రోజు సరఫరా చేయాల్సిన కొందరు డెలివరీ బాయ్స్ ఏజెన్సీ నిర్వాహకులతో కుమ్మక్కై బయటి వ్యక్తుల ద్వారా విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని గ్యాస్ పొయ్యి మరమ్మతులు, వాటి వస్తువులు విక్రయించే కొన్ని దుకాణాలను అడ్డాగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. గ్యాస్ బండను రూ.926.50 విక్రయించాల్సి ఉంది. ప్రభుత్వ రాయితీ రూ.46 బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500లను జమ చేస్తోంది.

కొందరు డెలివరీ బాయ్స్ పలువురు ప్రైవేటు వ్యాపారులకు గ్యాస్ ధర కన్నా రూ.50 అధికంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన ఆ వ్యాపారులు మరో రూ.100 కలిపి మొత్తం రూ.1100 విక్రయిస్తున్నారు. బుక్ చేసుకున్న వారికి సకాలంలో సిలిండర్ అందించకుండా ఇలా పక్కదారి పట్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరికొందరు డెలివరీ బాయ్స్ వినియోగదారులకు సరఫరా చేసినా అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

డెలివరీ బాయ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ నిర్వాహకులకు ఇప్పటికే సూచించాం. బుక్ చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు సరఫరా చేయాలి. గ్యాస్‌ను అందించకుండా ఇబ్బందులకు గురి చేసినా, అదనంగా డబ్బులు వసూలు చేసినా సంబంధిత బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయండి. వెంటనే సదరు ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.మోహన్‌బాబు, డీఎస్‌వో, సూర్యాపేట


## వాహన 'దారి'కి కష్టం..!

హాలియా : మంత్రి వర్యా.. నేను హాలియా పట్టణం దేవరకొండ రోడ్డులోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనను..ఐదేళ్ల క్రితం కోదాడ-జడ్చర్ల 167 జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగించడానికి అనువుగా హాలియా వద్ద ఎడమ కాల్వపై వంతెన విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. 60 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పుతో నా (వంతెన) విస్తరణ పనుల కోసం రూ.156 లక్షల నిధులు కేటాయించారని అధికారులు చెబుతున్నారు. ఐనప్పటికీ నేడు.. రేపు అని చెబుతూ అధికారులు, గుత్తేదారు విస్తరణ పనులు చేపట్టడం లేదు.ప్రస్తుతం నా పరిస్థితి ఇరుకుగా, రోడ్డుపై గుంతలు పడి చివరి భాగంలో కుంగిపోతున్నాను. జాతీయ రహదారి కావడంతో ఈ మార్గం గుండా హైదరాబాద్ నుంచి కర్నూలు నుంచి విజయవాడ, గుంటూరుకు ఇతర రాష్ట్రాలకు ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నా సమీపంలో పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు ఉన్నాయి. ప్రతి రోజు వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తుంటారు.

ఎడమ కాల్వ ప్రవాహం ఉధృతి అధికంగా ఉండటం, ఇరుకైన వంతెనపై నిత్యం వాహనాల ట్రాఫిక్ మధ్య విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. పర్వదినాల్లో, ఎన్నికల సమయంలో రాజకీయ సభలు జరిగినప్పుడు ఇరుకైన వంతెనపై ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులు నన్ను బాధిస్తున్నాయి.

గత నెల రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నాపై ఒక భాగం చివరలో పూర్తిగా కుంగిపోయింది. అధికారులు కుంగిపోయిన ప్రాంతంలో ఇప్పటికి నాలుగు పర్యాయాలు పూడ్చే ప్రక్రియ చేపట్టినా లాభం లేకుండా పోతుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా మీరు మంత్రిగా.. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి ఈ ప్రాంతానికి చెందిన వారే కావడం వల్ల వెంటనే విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటారని నేను ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను. ఇట్లు .. ఆరు దశాబ్దాల శిథిల వంతెన

## కొత్త కోర్సులతోనే ప్రయోజనం



వికారాబాద్ : జిల్లాలోని ఒకే ఒక్క ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన కొత్త కోర్సుల్లేక విద్యార్థులు నష్టపోతున్నారు. వికారాబాద్‌కు 2008లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశారు. 17 ఏళ్ల కిందట ఏ కోర్సులున్నాయో ఇప్పటికే అవే కొనసాగుతున్నాయి. కొత్త కోర్సులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**శివారెడ్డిపేట పారిశ్రామికవాడలో..**వికారాబాద్‌కు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయడంతో ప్రారంభంలో అరకొర సౌకర్యాలతో శివారెడ్డిపేట పారిశ్రామికవాడలోని షెడ్లలో తరగతులు నిర్వహించారు. అనంతరం వికారాబాద్‌కు 6 కి.మీ.దూరంలోని కొంపల్లిలో పక్కా భవనం నిర్మించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని 2016లో ప్రారంభించారు. కళాశాల ప్రారంభంలో సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ కోర్సులు ఏర్పాటు చేశారు. మూడు కోర్సుల్లో కలిపి 180 సీట్లు ఉన్నాయి.

**అన్ని సౌకర్యాలున్నాయి..:** పాత కోర్సులతోపాటు కొత్తగా కంప్యూటర్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ కోర్సులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొత్త కోర్సులకు అవసరమైన సదుపాయాలున్నాయి. కళాశాల 8 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పక్కా భవనం, అత్యాధునిక వసతులతో ప్రయోగశాల ఉంది. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థుల కోసం పక్కా వసతి గృహం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కళాశాల కొనసాగుతోంది. పరిగి, తాండూరులో కొత్తగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఏళ్లుగా విద్యార్థులు కోరుతున్నారు.

**విద్యార్థులకు మంచి అవకాశం..:** పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు గొప్ప వరం లాంటిది. డిప్లొమా తరవాత వెంటనే పరిశ్రమల్లో చేరే అవకాశముంటుంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవచ్చని, పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేస్తే వెంటనే ఏదో పరిశ్రమలో ఉద్యోగం సులభంగా లభిస్తుందని కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు. ఇంజినీరింగ్, రోడ్డు, భవనాలు, ఎయిర్‌లైన్స్, మెట్రో, రవాణా శాఖ, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం, బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ, ఆర్మీ, నేవీ, సింగరేణి, కార్పొరేట్ సంస్థలతోపాటు సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని వారు తెలిపారు.

## పైసలిచ్చి.. రేషన్ కార్డులు పట్టి!



కరీంనగర్ : కరీంనగర్‌లో ఏటా రూ.కోట్ల టర్నోవర్ సాగించే ఓ వ్యాపారి రేషన్‌కార్డు తీసుకున్నారు. తనకు తెలిసిన వ్యక్తి ద్వారా ఈ కార్డును పొందారు. దళారికి రూ.5 వేలు ఇస్తే పని అయిపోయింది. పెద్దపల్లి పట్టణంలో చౌకధరల దుకాణాల వద్దకు కారులో వచ్చి నెల నెలా రేషన్ బియ్యం తీసుకెళ్తున్నారు. ఇటీవల కొత్తకార్డుల జారీ సమయంలోనూ ఇలాంటి వారు కార్డులు పొందారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిల్లో హోటళ్లు, వస్త్ర వ్యాపారాలను నిర్వహించే వారిలో కొందరు రేషన్ కార్డులు తీసుకున్నారు. వారు ఏటా రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవారే.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బడా నాయకులు, పెద్ద వ్యాపార కుటుంబాలకు చెందిన వారికి కూడా రేషన్ కార్డు రావడాన్ని చూసి విస్తుపోతున్నారు. ఏటా రూ.లక్షలు సంపాదించే వ్యాపారులు.. సొంత భవనాలు, భూములు ఉండి.. నెలకు రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నవారు.. ఖరీదైన కార్లలో తిరిగేవారూ రేషన్ కార్డులు పొందారు.. అంగట్లో సరకు లెక్క దళారులు ధర కట్టడంతో డబ్బున్నవారు ఉపయోగించుకున్నారు.. కొన్నిచోట్ల మీసేవ కేంద్రాల నిర్వాహకులు.. ఇంకొన్ని చోట్ల తహసీల్దార్ కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ దళారుల అవతారమెత్తారు.. డబ్బున్నవారినే కాదు.. తక్కువ ఆదాయం ఉన్నవారి నుంచీ 'అంతా మేమే చూసుకుంటాం' అని చెప్పి వసూళ్ల పర్వానికి తెరతీశారు. అనర్హులకు కార్డులు అందజేశారు.

**ఉమ్మడి జిల్లాలో..**

ఈ ఏడాది జనవరిలో 9,77,333 కార్డులు ఉండగా అక్టోబరు వరకు 10,98,293 కార్డులు అయ్యాయి. 1,20,960 పెరిగాయి.

ఈ ఏడాది జులైన్ట్క 14 నుంచి కొత్త కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నిరంతర ప్రక్రియ అవడం వల్ల ఇప్పటికీ ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**కలెక్టర్ల దృష్టికి వెళ్లడంతో...**డబ్బులు తీసుకుని కార్డులు జారీ చేశారనే ఫిర్యాదులు జిల్లా కలెక్టర్లకు వెళ్లడంతో వీటి విషయమై దృష్టి సారించారు. కింది స్థాయి సిబ్బందితోపాటు దళారుల ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి మరింత లోతుగా ఆరా తీయాలని ఆర్డీవోలు, పౌరసరఫరాల శాఖ డీఎస్‌వోలను ఆదేశించినట్లు తెలిసింది. ముందుగా కొన్ని చౌకధరల దుకాణాలకు ఎంపిక చేసుకుని వాటిల్లో పరిశీలించే దిశగా అధికారులు ముందుకెళ్తున్నారు.

## అసంపూర్తిగా కొన్ని.. మొదలుకానివి మరిన్ని



మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల వాగుపై వంతెన నిర్మాణానికి స్థానికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. అవతల గ్రామాలకు, పొలాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. పక్షం రోజుల క్రితం కూడా వాగులోకి భారీగా నీరురావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.80 కోట్లు మంజూరు చేసింది. ఈ వంతెన పూర్తయితే మెట్‌పల్లి వాసులు కోనరావుపేట, కథలాపూర్ మండలం, వేములవాడ పుణ్యక్షేత్రానికి వెళ్లటానికి దూరభారం తగ్గుతోంది.

మెట్‌పల్లి మండలం ఏఎస్‌ఆర్ తండా కల్వర్టుపై వంతెన నిర్మాణానికి 2022లో రూ.81 లక్షలు మంజూరయ్యాయి. కాని ఇప్పటి వరకు పనుల్లో కదలిక లేదు. ఏటా కల్వర్టుపై నుంచి నీరు పారి రాకపోకలు నిలిచిపోతుండడంతో తండా వాసులు ఆందోళన చెందుతున్నారు. పదిహేను రోజుల క్రితం భారీ వర్షానికి నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. వంతెన పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పలు గ్రామాలకు వానకాలంలో రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. రాకపోకలు సజావుగా సాగాలంటే ఆయా మార్గాల్లో అవసరమైన చోట వారధులు అవసరం ఉండగా.. నిధులు మంజూరైనా పనులు మొదలవటం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో కల్వర్టులపై ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పారి ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మరికొన్ని వంతెనల పనులు ప్రారంభమై అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిధులు మంజూరైనా పనులు చేపట్టడానికి గుత్తేదారులు ఆసక్తి చూపటం లేదని తెలుస్తోంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పీఆర్ డీఈ రమణారెడ్డిని సంప్రదించగా.. ప్రారంభం కాని పనుల నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు.

**ఎక్కడెక్కడంటే..**

మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులో వాగుపై వంతెన పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. వంతెన పూర్తవగా.. ఇరువైపులా కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. వంతెనపై అక్కడక్కడ ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి.

ఆత్మకూర్-పాటిమీదితండా మధ్య కల్వర్టు స్థానంలో వంతెనకు 2022లో రూ.53 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించలేదు. చింతలపేట శివారులో ఆర్‌అండ్‌బీ రహదారిపై వంతెన పనులు అసంపూర్తిగా మిగిలాయి.మల్లాపూర్ మండలం రాఘవపేట-చిట్టాపూర్, సిరిపూర్-నడికుడ, వాల్గొండ-గొర్రెపల్లి, మల్లాపూర్-గొర్రెపల్లి బైపాస్‌రోడ్డు వంతెన పనులు చేపట్టాలి.

బ్రహింపట్నం-వర్షకొండ ఆర్‌అండ్‌బీ రహదారి మధ్య రెండు కల్వర్టుల స్థానంలో వంతెనలకు రూ.2 కోట్ల చొప్పున మంజూరైనా పరిస్థితి యథావిధిగా ఉంది. యామాపూర్-ఫకీర్‌కొండాపూర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి.కోరుట్ల మండలం సంగెం-ఏఖీన్‌పూర్ వంతెనకు రూ.1.50 కోట్లు మంజూరైనా పనులు మొదలుకాలేదు.

## పుట్టపర్తికి.. 'నిమ్మ' పచ్చడి

నకిరేకల్ : ఉత్సవాల్లో 'నిమ్మ' రుచులు పసందు చేయనున్నాయి. ఏపీలోని సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. వీటికి భారత్‌తో పాటు వివిధ దేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేయనున్నారు. అక్కడికి వచ్చే భక్తులకు 'నకిరేకల్ నిమ్మ' రుచులను అందించేందుకు స్థానిక సత్యసాయి సేవా సమితి కృషి చేస్తోంది. నకిరేకల్‌లోని సత్యసాయి మందిరంలో 30 క్వింటాళ్లకు పైగా నిమ్మ పచ్చడిని భక్తులే స్వయంగా తయారు చేస్తున్నారు. నకిరేకల్ ప్రాంతం నిమ్మకు ప్రసిద్ధి చెందడంతో భక్తులకు ఈ రుచులను చూపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సత్యసాయి సేవా సమితి నకిరేకల్ అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ దేవరశెట్టి శ్రీనివాసు లు తెలిపారు. ఏప్రిల్‌లో ఈ ప్రాంతంలోని నాణ్యమైన నిమ్మ కాయలు సేకరించి ఊరబెట్టామని, రెండు రోజులుగా మహిళా భక్తుల సహకారం తో పచ్చడిని తయారు చేస్తున్నామని వివరించారు. పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసి పటిష్ఠంగా ప్యాక్‌చేసి ఈనెల చివరి నాటికి పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరవేస్తామన్నారు. అక్కడ నాణ్యత పరీక్షలు నిర్వహించి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అల్పాహారం, భోజన సమయంలో వడ్డిస్తారని వివరించారు.

## పరికరాల్లేక.. ఫలించని ప్రయోగం

సూర్యాపేట : ప్రయోగ ప్రక్రియ ఇంటర్మీడియట్‌లో విద్యార్థి ఉన్నతికి ఎంతో కీలకం. అలాంటి ప్రయోగాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గదులు, పరికరాలు, రసాయనాల కొరత వేధిస్తోంది. ప్రైవేటులోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. అత్యధికంగా పరీక్షలకు ముందు కొద్దిరోజులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు 36 ఉండగా, 19 కస్తూర్బాగాంధీ, ఆదర్శ పాఠశాలలో ఇంటర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. ప్రథమ 13,100, ద్వితీయ 12,430 మంది విద్యార్థులు చదువుతున్నారు. పరికరాలు, రసాయనాల కొరత వల్ల ప్రయోగ తరగతులకు సంబంధించి సందిగ్ధం నెలకొంది. కొన్ని కళాశాలల్లో నేటికీ ప్రారంభించలేదు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సరిపోను గదుల్లేక ఒకే గదిలో నిర్వహిస్తున్నారు.



పెన్‌పహాడ్ కేజీబీవీలో ఇంటర్మీడియట్ తరగతుల నిర్వహణకే గదుల కొరత నెలకొంది. దీంతో ఒకే గదిలో ల్యాబ్, గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పరికరాలు, రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్ సామగ్రి లేదు. ఇబ్బందులు పడుతూ, ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.

**త్వరలో రసాయనాలు**ప్రభుత్వ కళాశాలల్లో పరికరాలు ఉన్నాయి. వీటికి త్వరలో రసాయనాలు రానున్నాయి. ప్రైవేటులో అన్నింట్లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లోనే ప్రయోగాలు చేయించాల్సి ఉంది. పరీక్ష మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్నాం. సీసీ కెమెరాల నిర్వహణలో పరీక్షలు జరగనున్నాయి.భానునాయక్, డీఐఈవో

## తప్పుల తక్కెడ.. అమ్మకాలకు యాతన

జుక్కల్ : జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. జెండర్ ఐచ్ఛికం(ఆప్షన్)లో వారి వివరాలు పురుషులకు బదులు మహిళలుగా నమోదయ్యాయి. పేర్ల అక్షరాల్లోనూ తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు ఇప్పట్లో అవకాశం లేదు. దీంతో పత్తి విక్రయం, విక్రయించిన తర్వాత ఖాతాల్లో డబ్బు జమ అయ్యే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది".


పత్తి కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని నిలువరిస్తూ రైతులు ఇబ్బందులు పడకుండా విక్రయించుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. పత్తి రైతులు మొదట ఇందులో తమ వివరాలు పొందుపరిచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. యాప్‌లో వివరాల్లో తప్పులు దొర్లుతుండటం, కొనుగోలు కేంద్రాల వివరాలు కనిపించకపోవడం తదితరాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రైతులు సాగు చేసిన పత్తి విస్తీర్ణం, కర్షకుల వివరాలను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నమోదు చేయించి ఆ జాబితాను సీసీఐకి ఇచ్చింది. దీని ఆధారంగా రైతులు యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకొనే అవకాశం కల్పించారు. అందుకు రైతులు 'కపాస్'లో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, సాగు విస్తీర్ణం నమోదు చేయాలి. రైతు మొబైల్ నంబరు ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. అనంతరం స్లాట్ బుకింగ్ ఐచ్ఛికంపై క్లిక్ చేస్తే.. ఏ రోజు.. ఏ సమయానికి పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలో సీసీఐ సూచిస్తుంది. అధికారులు మొదట యాప్‌లో వివరాలు నమోదుచేసే సమయంలో తప్పులు దొర్లాయి. వాటిని సరిదిద్దేందుకు ప్రస్తుతం అవకాశం లేదు. అధికారులు స్పందించి యాప్‌లో వివరాలను సవరించి విక్రయాలకు అవాంతరాలు ఎదురవకుండా చూడాలని పత్తి రైతులు కోరుతున్నారు.

అధికారులను సంప్రదించాలి..

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభమైతేనే స్లాట్ బుకింగ్ వివరాలు కపాస్ కిసాన్ యాప్‌లో కనిపిస్తాయి. యాప్‌లో వివరాల నమోదు కోసం రైతులు ఆధార్, పట్టాపాసుపుస్తకం, స్మార్ట్‌ఫోన్‌తో వ్యవసాయాధికారులను సంప్రదించాలి. సత్యనారాయణ, పర్యవేక్షకులు, ఏఎంసీ మద్నూర్

## పురాల్లో జీ+1గా ఇందిరమ్మ ఇళ్లు

నిజామాబాద్ : 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణంపై ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో.. బల్దియాల పరిధిలోని పేదలకు ఊరట లభించనుంది. ప్రభుత్వం మంజూరు చేసే ఇంటిని కనీసం 600 చదరపు అడుగుల స్థలంలో నిర్మించుకోవాలనే నిబంధన ఉంది. దీంతో కొందరు లబ్ధిదారులు నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. గ్రామాలతో పోల్చిచూస్తే పట్టణాల్లో ఎక్కువ మంది వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనను సడలించింది. 400 చదరపు అడుగుల కంటే తక్కువ స్థలం ఉన్నవారు 'జీ+1' విధానంలో ఇంటిని నిర్మించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇందిరమ్మ ఇళ్లను 'జీ+1'గా నిర్మించుకునే అవకాశం కల్పించడంతో నిజామాబాద్ నగరపాలకం, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ పురపాలక



సంఘాల పరిధిలోని లబ్ధిదారులకు ఊరట కలగనుంది. నగరంతో పాటు మిగతా మూడు పట్టణాల్లో కలిపి 2,950 ఇళ్లను వేగంగా పూర్తిచేయించాలని ఉన్నతాధికారులు లక్ష్యం విధించారు. ఇప్పటి వరకు 1,650 నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినా కొందరు ఆర్థిక స్తోమత లేక వెనుకడుగు వేస్తూ వచ్చారు. 'మెప్మా' ద్వారా ఇంటి రుణం అందిస్తున్నా స్పందించలేదు. ఇందుక్కారణం.. తగినంత సొంత స్థలం అందుబాటులో లేకపోవడమే. ఈ నేపథ్యంలో నిబంధనలో వెసులుబాటు కల్పిస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పురపాలక సంఘాల్లో అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతికి కృషిచేయాలని సూచించారు.




# ఏపీలో పదోతరగతి పరీక్షల తేదీలు వచ్చేశాయ్!

**అమరావతి: ఏపీలో పదో తరగతి పరీక్షల టైమ్‌టేబుల్‌ను ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. 16న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న గణితం, 25న భౌతికశాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘికశాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్-2), ఏప్రిల్ 1న ఓఎస్ఎస్‌సీ సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నారు.**

# నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి.. అధికారుల అప్రమత్తతతో తగ్గిన నష్టం: గొట్టిపాటి



అమరావతి: పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి పడిన ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అధికారులు అప్రమత్తమై నష్టాన్ని గణనీయంగా తగ్గించారని పేర్కొన్నారు. గండిని పూడ్చేయటంతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

ఇకపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గురువారం అర్ధరాత్రి గండి పడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఈక్రమంలో అధికారులు అప్రమత్తమై శుక్రవారం ఉదయం గండిని పూడ్చారు.

# సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోంది: యనమల

అమరావతి: సభాహక్కుల కమిటీకి జగన్ మీడియా ఎందుకు భయపడుతోందని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. తప్పుడు వార్తలు రాసి.. ఇప్పుడు ప్రొసీడింగ్స్‌ను అడ్డుకుంటారా అని ప్రశ్నించారు. సాక్షిలో తప్పుడు వార్తలపై అసెంబ్లీకి వచ్చి వివరణ ఇవ్వొచ్చన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతుల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారంటూ శాసనసభ, సభాపతిని చులకన చేసేలా సాక్షిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. గురువారం హైదరాబాద్‌లో నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యే సమయంలో జగన్ బలప్రదర్శన చేసిన తీరును యనమల తప్పుబట్టారు. "కోర్టుకు హాజరు కావాలంటే, నేరస్థుడిగా ఆరోపించబడిన వ్యక్తి ప్రజలకు ఇబ్బంది కలిగించాల్సిన అవసరం లేదు. ఆయన చర్యలు న్యాయస్థానాన్ని బెదిరించేలా ఉన్నాయి. 2029లో జగన్ అధికారం



చేపట్టి ప్రజల ఆస్తులను దోచుకుంటాడు అన్నట్లుగా ఆయన అనుచరుల నినాదాలు ఉన్నాయి" అని యనమల అన్నారు.

# దేవ్‌జీ, రాజిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నారనేందుకు ఆధారాలు లేవు: ఏపీ హైకోర్టు

అమరావతి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సీనియర్ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలు పోలీసుల అదుపులో ఉన్నారు అనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని, వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని ఏపీ హైకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. ఆధారాలు లభిస్తే కోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. దేవ్‌జీ, రాజిరెడ్డిలను హైకోర్టులో హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రం కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి గంగాధర్, హైదరాబాద్‌కు చెందిన మల్లా స్నేహలత హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది జై భీమారావు వాదనలు వినిపిస్తూ.. 'ఈ నెల 18న మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయి. దేవ్‌జీ, రాజిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టు ముందు హాజరుపరిచేలా ఆదేశించండి. పోలీసు ఉన్నతాధికారులు మీడియాతో మాట్లాడుతూ 9 మంది కీలక నేతలను అదుపులోకి తీసుకున్నామని ప్రకటన చేశారు. ఆ వీడియోను కోర్టు ముందు ఉంచుతాం' అని తెలిపారు. దీంతో విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. నిన్న జరిగిన విచారణలో ఆధారాలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. పిటిషనర్ల తరుపు న్యాయవాది సమర్పించిన




వీడియోలో సెక్యూరిటి సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పినట్లు ధర్మాసనం గుర్తించింది. దేవ్‌జీ గురించి మీడియా ప్రతినిదులు అడగ్గా.. తమ ఆదీనంలో లేరని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. దేవ్‌జీ, రాజారెడ్డి పోలీసుల నిర్భందంలో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేవని నిర్ధరించిన న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం.. ఈ వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

# చరమాంక దశకు జగన్ రాజకీయ జీవితం.. అశోక్ బాబు సంచలన కామెంట్స్

అమరావతి, నవంబర్ 21: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. 11 సీబీఐ, 9 ఈడీ చార్జిషీట్లు ఉన్న జగన్.. కోర్టుకు హాజరైన తీరు 'చావుకి, పెళ్ళికి ఒకే భజంత్రి' అనే సామెతను గుర్తు చేసిందంటూ ఎద్దేవా చేశారు. గతంలో సీనియర్ నాయకులు లాలూ, పీవీ నరసింహారావు నిరాడంబరంగా కోర్టుకు హాజరయ్యారని గుర్తు చేశారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక పంథా మార్చారన్నారు. గతంలో ఖర్చుల పేరు చెప్పి వాయిదాలు అడిగిన జగన్.. ఇప్పుడు చార్టెడ్ ఫ్లైట్‌లో వచ్చి వేల మందితో హడావుడి చేసి కోర్టుకు హాజరవడం విచిత్రమన్నారు. కోర్టు హాజరులో ఇంత బల ప్రదర్శన చూస్తే అసెంబ్లీకి వెళ్తున్నారా, కోర్టుకు వెళ్తున్నారా అనే సందేహం కలిగించిందని మాజీ ఎమ్మెల్సీ అన్నారు. అసెంబ్లీకి రాని వ్యక్తి కోర్టుకు వెళ్లేటప్పుడు ఇంత ఆర్భాటం అవసరమా అని సామాన్య ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారన్నారు. జగన్ ఒక రకమైన ఉన్మాదం, భయంతో ఉన్నారని.. అతని రాజకీయ జీవితం చరమాంక దశకు చేరుకుందంటూ వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇచ్చి జగన్ స్థాయి ఏంటో చెప్పేశారన్నారు. ఏ కేసులో శిక్ష పడినా రాజకీయ భవిష్యత్తు ఖతం అవుతుందని.. 2029లో కడపలో కూడా గెలవలేరని పేర్కొన్నారు. ల్యాండ్, శాండ్, వైన్ కుంభకోణాలలో లక్షల కోట్లు అవినీతి చేశారని... అన్ని వేళ్ళు తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నాయని అన్నారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో మొదట చంద్రబాబు నాయుడుపై నింద వేశారని.. కానీ ఇప్పుడు సీబీఐ సాక్ష్యాలు.. జగన్. అతని భార్య వైపు చూపిస్తున్నాయని తెలిపారు. తల్లిని, చెల్లెలిని కూడా సరిగ్గా చూడని వ్యక్తి రాష్ట్రాన్ని ఏం చూస్తారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ఈ బల ప్రదర్శనలకు భయపడదని.. దీని వల్ల నష్టపోయేది జగన్, అతని శ్రేణులు మాత్రమే అని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక విధ్వంసం నుంచి బయటపడటంపై దృష్టి సారించిందని తెలిపారు. వైసీపీ శ్రేణులు వాస్తవాలు గమనించి, జగన్‌తో ఉండాలా? వద్దా? అనేది ఆలోచించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు హితవుపలికారు.

# క్రేన్ కూలి టీచర్ మృతి.. హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

పాయకరావుపేట: శ్లాబ్ సామగ్రి మోసుకెళ్లే క్రేన్ కూలి.. అనకాపల్లి జిల్లాలో ఆంగ్ల ఉపాధ్యాయురాలు జోష్నా భాయ్ మృతి చెందడం పట్ల హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. దీనిపై విచారణకు ఆదేశించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలోని రాజానగరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయురాలు దుర్మరణం చెందారు. పాఠశాల ఆవరణలో కళావేదిక నిర్మాణం జరుగుతోంది. దీనికి శ్లాబ్ వేసేందుకు క్రేన్ సాయంతో సామగ్రి పైభాగానికి తరలిస్తున్నారు. ఇదే సమయంలో క్రేన్ కూలి.. పాఠశాల లోపలికి వెళ్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు జోష్నా భాయ్(45)పై సామగ్రి పడింది. గాయపడిన ఆమెను హుటాహుటిన తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆమె మృతి చెందారు.




ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటం మెక్సికో భామను వరించింది. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్–2025 పోటీల్లో మిస్ మెక్సికో‌గా ఫాతిమా బాష్ విజేతగా నిలిచింది. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటాన్ని అందజేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న తొలి ప్రయత్నంలోనే ఫాతిమా విశ్వసుందరిగా నిలిచి అందర్నీ ఆశ్చర్యపర్చారు. ప్రపంచ దేశాల నుంచి దాదాపు 120 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారందరినీ వెనక్కినెట్టి ఈ 25 ఏళ్ల భామ అందాల కిరీటాన్ని దక్కించుకుంది. ఇక తొలి రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీనర్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనెజువెలాకు చెందిన స్టెఫానీ అబాసలీ నిలిచారు. మెక్సికోలోని శాంటియాగో డి తెపా ప్రాంతానికి చెందిన ఫాతిమా.. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశారు. స్కూల్‌లో చదువుతున్నప్పుడు డిస్లెక్సియా, హైపర్‌యాక్టివిటీ డిజార్డర్‌తో బాధ పడినట్లు ఫాతిమా గతంలో తెలిపారు. వాటిని దాటుకొని అందాల పోటీలకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన మిస్ యూనివర్స్ మెక్సికో 2025 పోటీల్లో విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో భారత్ నుంచి మణిక విశ్వకర్మ ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ఆమె కిరీటం దక్కించుకోలేకపోయారు. రాజస్థాన్‌కు చెందిన మణిక.. స్విమ్‌సూట్ రౌండ్‌తో టాప్ 30 వరకు చేరుకుంది. టాప్ 12లో నిలవలేకపోవడంతో ఈ ఏడాది భారత్‌కు అందాల కిరీటం చేజారింది. ఇక, మిస్ యూనివర్స్ పోటీల్లో మన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్.. న్యాయనిర్ణేతల్లో ఒకరిగా ఉండటం విశేషం.

**ప్రైజ్ మనీ ఇదే..** మిస్ యూనివర్స్ విజేతకు నగదు బహుమతి ఎంతనే వివరాలను ఆర్గనైజేషన్ వెల్లడించలేదు. అయితే, విశ్వసుందరి కిరీటం దక్కిన వారికి 2,50,000 డాలర్ల ప్రైజ్ మనీ ఇస్తారని పలు కథనాలు వెల్లడించాయి. దీంతో పాటు నెల నెలా 50వేల డాలర్ల వేతనం కూడా అందుతుంది.

ఇక, అందాల రాణి ధరించే కిరీటం ధర 5 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.44కోట్లు) పైనే ఉంటుంది. విశ్వసుందరికి న్యూయార్క్ నగరంలో మిస్ యూనివర్స్ అపార్ట్‌మెంట్స్‌లో సంవత్సరం పాటు ఉచిత నివాస సౌకర్యం కల్పిస్తారు. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ విజేతకు ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్, సహాయకులతో కూడిన బృందాన్ని ఉచితంగా నియమిస్తుంది. కిరీటం సొంతం చేసుకున్నవారు మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్‌కు సంవత్సరం పాటు చీఫ్ అంబాసిడర్‌గా కొనసాగుతారు. ఈ క్రమంలో కొన్ని బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరం ఉంటుంది. దానిలోభాగంగా సంస్థ నిర్వహించే సామాజిక కార్యక్రమాలు, పార్టీలు, ప్రెస్ కాన్ఫరెన్సులకు హాజరవ్వాల్సి ఉంటుంది. విశ్వసుందరిగా నిలిచినవారు సంవత్సరం పాటు ఉచితంగా ప్రపంచమంతా చుట్టి రావచ్చు. ఈ సమయంలో హోటల్, రెస్టారెంట్ల ఖర్చులను కూడా ఆ సంస్థే భరిస్తుంటుంది.





# భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి వేడుకలు

**కార్తిక మాసం ముగింపులో భాగంగా పోలి పాడ్యమి వేడుకలను తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. అనంతరం అరటి డొప్పలలో దీపాలను ఉంచి నీటిలో విడిచిపెడుతున్నారు. దీంతో చెరువులు, నదులు దీప కాంతులతో వెలిగిపోతున్నాయి. స్థానిక శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.**

# ఏపీ మద్యం కుంభకోణం కేసు.. నిందితుల రిమాండ్ పొడిగింపు

అమరావతి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ నేటితో ముగియడంతో అధికారులు వారిని విజయవాడ జిల్లా జైలు నుంచి ఏసీబీ కోర్టుకు తరలించారు.

రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, అనిల్ చోక్రా, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్యను జిల్లా జైలు నుంచి న్యాయస్థానానికి తీసుకువచ్చారు. గుంటూరు జైలు నుంచి మరో ఇద్దరు నిందితులు నవీన్ కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్‌ను హాజరుపరిచారు. ఈక్రమంలో ఏపీ మద్యం కేసు నిందితులకు న్యాయస్థానం డిసెంబర్ 5 వరకు రిమాండ్ పొడిగించింది. డిఫాల్ట్ బెయిల్ పొందిన నిందితులు మినహా మిగతా వారికి రిమాండ్ పొడిగించింది.



# సోషల్ మీడియాలో రైతుల పోస్టులపై మంత్రి నారాయణ రియాక్షన్




అమరావతి, నవంబర్ 21: రాజధానిలోని వెంకటపాలెం, ఉద్దండరాయుని పాలెంలో మంత్రి నారాయణ ఈరోజు (శుక్రవారం) ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా సిటీస్ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టిన అంగన్వాడీ, హెల్త్ సెంటర్లు, స్కూల్స్ భవనాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... అమరావతిలో సిటీస్ ప్రాజెక్ట్ ద్వారా 15 అంగన్వాడీ భవనాలు, 14 పీహెచ్‌సీ భవనాలు, 14 స్కూల్స్, ఒక మల్టీపర్పస్ శ్మశాన వాటిక నిర్మించామన్నారు. వీటి ద్వారా రాజధాని గ్రామాల్లో నాణ్యమైన విద్యా, వైద్య సదుపాయాలు అందుతాయని వెల్లడించారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్లలో మౌళిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణ పనులు పూర్తవుతాయని ప్రకటించారు. రాజధానిలో మొత్తం 69,421 మంది రైతులకు 61,433 ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు పూర్తి అయ్యాయన్నారు. ఇంకా కేవలం 2270 మంది రైతులకు 7988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని తెలిపారు. ప్రతి రోజూ 30 నుంచి 40 రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయని అన్నారు. గత 21 రోజుల్లో 231 మందికి 443 ప్లాట్ల రిజిస్ట్రేషన్లను పూర్తి చేశామని మంత్రి తెలిపారు. మొత్తం 30,635 మంది రైతులలో 29,644 మందికి ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. ఇంకా 991 మంది రైతులకు మాత్రమే ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కొందరు రైతులు తమకు కావలిసిన చోటే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని అడుగుతున్నారని.. ఒకరిద్దరు రైతులు అనవసరంగా సోషల్ మీడియాలో రకరకాల పోస్ట్‌లు పెట్టారని అన్నారు. రాజధాని రైతులకు ఎవరికీ అన్యాయం జరగదని.. రైతులకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని మంత్రి నారాయణ తేల్చిచెప్పారు.

# శాంతిపురంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన నారా భువనేశ్వరి

శాంతిపురం: సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. శాంతిపురం మండలం శివపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలతో వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ మూడో రోజు శాంతిపురం మండలంలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పలువురు తెదేపా నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కపూర్ బ్యూటీ మళ్లీ సర్‌ప్రైజ్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనమ్ కపూర్ మరోసారి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. 2018లో వ్యాపారవేత్త ఆనంద్ ఆహుజాను వివాహం చేసుకున్న సోనమ్ కపూర్ 2022లో మొదటి సారి తల్లి అయింది. ఆ సమయంలోనూ తాను తల్లి కాబోతున్నాను అంటూ సర్‌ప్రైజింగ్ ఫోటోలు షేర్ చేసింది. బేబీ బంప్‌తో సోనమ్ కపూర్ షేర్ చేసిన ఫోటోలు ఆ సమయంలో చర్చనీయాంశం అయ్యాయి. స్టార్ హీరోయిన్ తల్లి కాబోతుంది అంటూ తెగ ప్రచారం జరిగింది. మొదటి సారి బాబుకు జన్మనిచ్చిన సోనమ్ కపూర్ దంపతులు అతడికి వాయు అని పేరు పెట్టారు. వాయు ఇప్పుడు మూడు ఏళ్ల వయసు పిల్లాడు. ఇంతలోనే అతడు అన్న కాబోతున్నాడు అంటూ అధికారికంగా ప్రకటన వచ్చింది. వాయు అన్న



కాబోతున్నట్లుగా అధికారికంగా సోనమ్ కపూర్ ఫోటోలు షేర్ చేసి మరీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రెగ్నెంట్...** సోనమ్ కపూర్ పింక్ కలర్ డ్రెస్‌లో బేబీ బంప్‌తో ఉన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగానే సెలబ్రిటీల యొక్క ప్రెగ్నెన్సీ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. కానీ సోనమ్ కపూర్ యొక్క సెకండ్ ప్రెగ్నెన్సీ పెద్దగా చర్చ జరగలేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ప్రెగ్నెన్సీ గురించి ప్రచారం జరగలేదు. దాంతో అసలు విషయం ఏంటో అనేది క్లారిటీ లేదు. ఇప్పుడు సోనమ్ కపూర్ నుంచి క్లారిటీ వచ్చింది. ఆమె బేబీ బంప్ తో ఫోటో షూట్ ఇచ్చింది. దాంతో ఒక్కసారిగా అంతా సర్‌ప్రైజ్ అయ్యారు. సాధారణంగా అయితే సోషల్ మీడియాలో ప్రచారం జరిగి ఆ తర్వాత విషయాన్ని కన్ఫర్మ్ చేస్తారు. కానీ సోనమ్ కపూర్ సెకండ్ ప్రెగ్నెన్సీ విషయం గురించి వార్తలు రాకపోవడంతో ఇప్పుడు అంతా సర్‌ప్రైజ్ అవుతున్నారు అనేది సోషల్ మీడియా కామెంట్స్‌ను చూస్తే అర్థం అవుతుంది.

## ఖుషికి 100% ఫ్రీ... బోనీకపూర్ ఫుల్ హ్యాపీ

ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కూతురు, హీరోయిన్ జాన్వీ కపూర్ సోదరి అయిన ఖుషి కపూర్ ఇప్పటికే నటిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. కెరీర్ ఆరంభంలో నటిగా కాకుండా డైరెక్షన్ వైపు ఆసక్తి చూపించిన ఖుషి కపూర్ ఇప్పుడు పూర్తి స్థాయి నటిగా మారి హీరోయిన్‌గా సినిమాలు చేసింది, ముందు ముందు ఈమె నుంచి మరిన్ని సినిమాలు వస్తాయని అంతా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఖుషి కపూర్ కి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ వారు 100% స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధం కావడం జరిగిందట. ఈ విషయాన్ని చాలా గర్వంగా ఖుషి కపూర్ తండ్రి బోనీ కపూర్ ప్రకటించారు. తన కూతురు ప్రతిభ పట్ల తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నాడు. ఖుషి కపూర్ న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో నటనలో మరింతగా శిక్షణ తీసుకునేందుకు అతి త్వరలోనే వెళ్లే అవకాశాలు ఉన్నాయని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

**ఖుషి కపూర్‌కి 100% స్కాలర్‌షిప్...** బోనీ కపూర్ తల్చుకుంటూ ఎంత ఫీజ్ అయినా కూతురు ఖుషి కపూర్‌కి చెల్లించి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో జాయిన్ చేయగలరు. కానీ ఆమె నూరు శాతం స్కాలర్ షిప్‌ను దక్కించుకోవ



డంతో ఆమె ప్రతిభ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆమెకు నటనపై ఉన్న ఆసక్తి దీంతో బయట పడిందని కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో ప్రస్తుతం ఖుషి కపూర్ నూరు శాతం స్కాలర్‌షిప్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఖుషి కపూర్ నటిగా ముందు ముందు మరిన్ని మంచి సినిమాలు చేస్తుందనే విశ్వాసం మాకు ఉంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు అక్క గ్లామర్‌తో గుర్తింపు దక్కించుకుంటే ఖుషి ఖచ్చితంగా తన నటన ప్రతిభతో గుర్తింపు దక్కించుకుంటుంది అనే విశ్వాసంను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

**బోనీ కపూర్ హ్యాపీ..** ఇటీవల బోనీ కపూర్ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఖుషి కపూర్ గురించి మాట్లాడుతూ.. తన యొక్క బెస్ట్ ఆడిషన్స్ వీడియోను న్యూయార్స్ ఫిల్మ్ అకాడమీకి ఖుషి పంపించడం వల్లే వంద శాతం స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయిందని బోనీ కపూర్ అన్నాడు.

మీరు కూడా ఇలా చేయవచ్చు అంటూ ఆ కార్యక్రమానికి హాజరు అయిన వారికి బోనీ కపూర్ సూచించాడు. ఖుషి కపూర్ సాధించిన ఈ స్కాలర్‌షిప్ తండ్రిగా గర్వించేలా చేసిందని అన్నాడు. ఆమె రాబోయే రోజుల్లో బెస్ట్ నటిగా మరిన్ని గుర్తింపు, గౌరవాలు దక్కించుకోవాలని ఆశ పడుతున్నట్లుగా బోనీ కపూర్ చెప్పుకొచ్చాడు. ఖుషి కపూర్ ప్రతిభ విషయంలో బోనీ కపూర్ మాట్లాడుతున్న సమయంలో తండ్రిగా ఆయన చాలా సంతృప్తితో ఉన్నట్లుగా అర్థం అవుతుంది. ఖుషి కపూర్ బాలీవుడ్‌తో పాటు సౌత్‌లోనూ నటిస్తుందేమో చూడాలి.




# ది రాజా సాబ్: ఓవర్సీస్ లో అసలు రచ్చకు కారణమిదే



ప్రభాస్ అంటేనే భారీ కటౌట్, చేతిలో పెద్ద కత్తి, యుద్ధం.. గత కొన్నేళ్లుగా మనకు ఇవే గుర్తొస్తున్నాయి. 'బాహుబలి' నుంచి మొన్నటి 'కల్కి' వరకు ప్రభాస్ ను ఒక సీరియస్ వారియర్ గానే చూస్తున్నాం. కానీ ఫ్యాన్స్ మనసులో మాత్రం ఎక్కడో ఒక చిన్న వెలితి ఉంది. మా పాత 'డార్లింగ్' ఎప్పుడు వస్తాడు? 'బుజ్జిగాడు' లాంటి ఈజ్, ఆ చిలిపి నవ్వులు మళ్ళీ ఎప్పుడు చూస్తాం? అని వారు ఎదురుచూడని రోజు లేదు. సరిగ్గా ఆ కోరిక తీర్చడానికే 'ది రాజా సాబ్' వస్తున్నాడు. నార్త్ అమెరికాలో ఈ సినిమాపై ఉన్న క్రేజ్ చూసి ట్రేడ్ పండితులు ఆశ్చర్యపోవడానికి ప్రధాన కారణం ఇదే. ఇది వందల కోట్ల విజువల్ ఎఫెక్ట్స్ సినిమానే, యుద్ధం లేదు. కేవలం మారుతి మార్క్ హారర్ కామెడీ. గ్రాఫిక్స్ లోన్ భయపెడుతూ నవ్వించనున్నారు. అయినా సరే, 2026న జనవరి 8 ప్రీమియర్స్ ఉంటే, నెల రోజుల ముందే (డిసెంబర్ 4న) టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేస్తున్నారు. సాధారణంగా రాజమౌళి సినిమాకో, లేదా భారీ యాక్షన్ సినిమాకో ఇలాంటి హడావిడి ఉంటుంది. కానీ ఒక ఫన్ ఎంటర్టైనర్ కి ఈ రేంజ్ రెస్పాన్స్ రావడం ప్రభాస్ స్టార్ డమ్ కి నిదర్శనం. అసలు విషయం ఏంటంటే.. ప్రభాస్ ని సీరియస్ రోల్స్ లో చూసి చూసి ఆడియన్స్ కి ఒక రకమైన ఫీలింగ్ వచ్చింది. అందుకే ఈసారి ఆయన్ని ఒక ఫన్, ఈజీ గోయింగ్ రోల్ లో చూడాలని డిసైడ్ అయ్యారు. మారుతికి కామెడీ టైమింగ్, హీరోల బాడీ లాంగ్వేజ్ ని స్టైలిష్ గా చూపించడంలో మంచి పట్టుంది. ఈ కాంబినేషన్ లో 'వింటేజ్ ప్రభాస్' బయటకు వస్తాడనే నమ్మకమే ఇప్పుడు ఓవర్సీస్ లో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యే ఛాన్స్ ఉంది. మరోవైపు సందీప్ రెడ్డి వంగాతో చేయబోయే 'స్పిరిట్' సినిమా పనులు డిసెంబర్ లో మొదలవుతున్నాయి. లుక్ టెస్ట్ కూడా పూర్తయింది. అది ఎలాగూ వయొలెన్స్ తో కూడిన సీరియస్ సినిమా.

కాబట్టి ఆ రక్తపాతం చూసేలోపు, ప్రేక్షకులకు కాస్త రిలీఫ్ ఇచ్చేలాగా 'రాజా సాబ్' ఉపయోగపడనుంది. ప్రభాస్ కెరీర్ గ్రాఫ్ లో ఇదొక పర్ఫెక్ట్ బ్యాలెన్సింగ్ స్టెప్. నార్త్ అమెరికాలో మొదలైన ఈ హంగామా చూస్తుంటే, 'రాజా సాబ్' బాక్సాఫీస్ దగ్గర నవ్వుల జాతర చేయడం ఖాయంగా కనిపిస్తోంది. బాహుబలి 2 రికార్డులను (22 మిలియన్ డాలర్లు) టచ్ చేయాలంటే కత్తులే అవసరం లేదు, డార్లింగ్ నవ్వితే చాలు అని ఈ సినిమా నిరూపించేలా ఉంది. చూడాలి మరి ఓపెనింగ్స్ రికార్డులు ఏ రేంజ్ లో ఉంటాయో.

# ట్రైలర్: 'యూరి' డైరెక్టర్.. ఒళ్లు గగుర్పొడిచే టార్చర్..





'యూరి: ది సర్జికల్ స్ట్రైక్' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత డైరెక్టర్ ఆదిత్య ధర్ నుంచి ఆరేళ్ల గ్యాప్ వచ్చింది. ఇంత గ్యాప్ తీసుకుని ఆయన ఏం చేస్తున్నాడా అని ఆడియన్స్ ఎదురుచూస్తుండగా, ఇప్పుడు "ధురంధర్" అంటూ ఒక పవర్ ప్యాక్డ్, రా యాక్షన్ ట్రైలర్‌తో షాక్ ఇచ్చాడు.

డిసెంబర్ 5న రిలీజ్ కానున్న ఈ సినిమా ట్రైలర్ ని రిలీజ్ చేశారు. ఇక ట్రైలర్ చూస్తుంటే, ఇది కేవలం యాక్షన్ సినిమా కాదు, అంతకుమించి ఒళ్లు జలదరించే హింస, పచ్చి నిజాలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ట్రైలర్ సినిమాలోని మెయిన్ క్యారెక్టర్లను పరిచయం చేసే తీరు చాలా భయంకరంగా ఉంది. ముఖ్యంగా అర్జున్ రాంపాల్ పోషించిన 'మేజర్ ఇక్బాల్' ISI ఏజెంట్ గా పాత్రను పరిచయం చేసిన విధానం గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ఒక వ్యక్తి శరీరం నుంచి కొక్కేలతో మాంసాన్ని వేలాడదీస్తున్నట్లు చూపించిన షాట్స్ చాలా డిస్టర్బింగ్‌గా, రాగా ఉన్నాయి. రణ్‌వీర్ సింగ్ ఈ సినిమాలో హీరోగా, ఒక కొత్త రకమైన లాంగ్ హెయిర్, గడ్డంతో రగ్డ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ట్రైలర్ మొత్తం ఇండియా పాకిస్తాన్ సెటప్‌లో, టెర్రరిజం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఈ కథ 2000ల తొలినాళ్లలో హిజ్బుల్ ముజాహిదీన్‌లో అండర్‌కవర్‌లో చొరబడిన మేజర్ మోహిత్ శర్మ (ఇఫ్తికార్) నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో స్టార్ కాస్టింగ్ గట్టిగానే ఉంది. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ పాత్ర స్ఫూర్తితో ఆర్. మాధవన్ 'అజయ్ సన్యల్'గా కనిపిస్తుండగా, సంజయ్ దత్ 'ఎస్పీ చౌదరి అస్లాం'గా, అక్షయ్ ఖన్నా 'రెహ్మాన్ డకైత్'గా పవర్ ఫుల్ రోల్స్‌లో కనిపించారు. ట్రైలర్ మొత్తం యాక్షన్ మోడ్‌లోనే సాగింది. అయితే, ఇది రొటీన్ బాలీవుడ్ దేశభక్తి టెంప్లేట్‌ను ఫాలో అవుతుందా అనే అనుమానం కూడా కలుగుతోంది. కానీ, డైరెక్టర్ ఆదిత్య ధర్ 'యూరి'తో ప్రూవ్ చేసుకున్నాడు కాబట్టి, యాక్షన్ సీక్వెన్సులు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి. అయితే, ట్రైలర్‌లో చూపించిన హింస డోస్ కాస్త ఎక్కువగానే ఉంది. ఇది ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# సముద్ర తీరాన మంచు లక్ష్మి.. గ్లామర్ క్వీన్!

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమైనా, తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు, ఫ్యాన్ బేస్ను ఏర్పరచుకున్నారు మంచు లక్ష్మి. నటిగా, నిర్మాతగా, టీవీ హోస్ట్గా ఆల్ రౌండర్ గా నిరూపించుకుంటూ దూసుకుపోతున్నారు. తనదైన యాస, భాషతో, ముక్కుసూటితనంతో తెలుగు ప్రేక్షకులలో డిఫరెంట్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. లేటెస్ట్ గా మంచు లక్ష్మి తన వెకేషన్కు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. సముద్ర తీరాన, బోట్ల మధ్య నిలబడి వైట్ కలర్ షార్ట్ డ్రెస్లో ఎంతో స్టైలిష్గా, ఉల్లాసంగా కనిపిస్తున్నారు. తలపై టోపీ, కళ్లకు కూలింగ్ గ్లాసెస్ ధరించి చిల్ అవుతున్న ఈ ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. "అలలు, మంచి వైబ్స్ కలిసే చోట నన్ను చూడండి" అంటూ ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చారు. అమెరికాలో ఉన్నప్పుడే ఇంగ్లీష్ సిరీస్లలో నటించిన



లక్ష్మి, ఇండియాకు వచ్చాక 'ప్రేమతో మీ లక్ష్మి', 'మేము సైతం' వంటి షోలతో పాపులర్ అయ్యారు. ఇక వెండితెరపై 'అనగనగా ఓ ధీరుడు', 'గుండెల్లో గోదారి', 'దొంగాట' వంటి చిత్రాల్లో విలక్షణమైన పాత్రలు పోషించి విమర్శకుల ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. ప్రయోగాత్మక పాత్రలు చేయడానికి ఆమె ఎప్పుడూ ముందుంటారు. ఈ మధ్య కాలంలో మంచు లక్ష్మి హైదరాబాద్ కంటే ముంబైలోనే ఎక్కువగా ఉంటున్నారు. టాలీవుడ్తో పాటు బాలీవుడ్లోనూ సత్తా చాటాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కేవలం రెగ్యులర్ పాత్రలే కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న ఛాలెంజింగ్ రోల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల 'మాన్స్టర్' వంటి మలయాళ చిత్రంలోనూ నటించి మెప్పించారు. సినిమాలు, షోలతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో మాత్రం మంచు లక్ష్మి ఫుల్ యాక్టివ్గా ఉంటారు. తన ఫిట్నెస్ వీడియోలు, గ్లామరస్ ఫొటోషూట్లు, వెకేషన్ రీల్స్ను ఎప్పటికప్పుడు షేర్ చేస్తూ ఫాలోవర్లకు టచ్లో ఉంటారు. వయసు పెరుగుతున్నా, తన ఎనర్జీ, గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని ఈ లేటెస్ట్ ఫొటోలు చూస్తే అర్థమవుతోంది.

## అందుకే డెలివరీ తర్వాత బరువు తగ్గా..

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది అలియా భట్. తన అద్భుతమైన నటనతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె కెరియర్ పీక్స్ లో ఉండగానే ప్రముఖ హీరో రణబీర్ కపూర్ తో ఏడడుగులు వేసింది. అదే ఏడాది పండంటి అమ్మాయికి కూడా జన్మనిచ్చింది. కూతురుకి రాహా అని నామకరణం చేసింది ఈ జంట. ఇకపోతే రాహా జన్మించిన తర్వాత తమ జీవితంలోనే కాదు లైఫ్ స్టైల్ లో కూడా చాలా మార్పులు వచ్చాయి అని.. అలవాటు లేని పనులు కూడా చేయాల్సి వస్తోంది అంటూ సరదాగా చెప్పుకొచ్చింది ఆలియా భట్. అంతేకాదు తాను డెలివరీ తర్వాత వేగంగా బరువు తగ్గడానికి గల కారణాన్ని కూడా ఆమె బయటపెట్టింది. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రముఖ బాలీవుడ్ నటీమణులు కాజోల్, ట్వింకిల్ కన్నా అమెజాన్ ప్రైమ్ వీడియోలో "టూ మచ్" అనే ఒక టాక్ షో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సహనటుడు వరుణ్ ధావన్ తో కలిసి ఆలియా భట్ ముఖ్య అతిథిగా హాజరయ్యింది. ఈ టాక్ షోలో తన నిద్రతీరు గురించి కూడా ఆమె మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ కూడా త్వరగా పడుకొని త్వరగా లేచే వ్యక్తిని. కానీ రాహా పుట్టిన తర్వాత నా నిద్ర టైమింగ్లో చాలా మార్పులు వచ్చాయి. నేను మేల్కొనకూడదు అనుకున్నాను. సాధారణంగా నేను తొమ్మిదిన్నర గంటలకే నిద్రపోతాను. అయితే ఇప్పుడు నిద్రపోయిన



గంటలను లెక్కిస్తున్నాను. కానీ ఇదంతా నా కూతురు కోసమే అని తెలిసి మరింత సంతోషంగా ఉంది"అంటూ చెప్పుకొచ్చింది. అలాగే రాహాకు జన్మనిచ్చిన తర్వాత నేను వేగంగా బరువు తగ్గిపోయాను. దీంతో చాలామంది నాపై విమర్శలు గుప్పించారు.. అసలు నిజం ఏమిటంటే.. రాహాకు జన్మనిచ్చిన తర్వాత నేను వేగంగా బరువు తగ్గాను. తల్లిపాలు ఇవ్వడం వల్ల చాలా క్యాలరీలు ఖర్చు అవుతాయి. ముఖ్యంగా నేను ఎంత తిన్నా సరే సహజంగానే బరువు తగ్గాను. అయితే నా ఫోటో బయటకు వచ్చినప్పుడు నేను అసహజ పద్ధతులలో బరువు తగ్గాను అంటూ నాపై చాలామంది ట్రోల్స్ చేశారు.. ఎందుకు అంత త్వరగా బరువు తగ్గాల్సి వచ్చింది అంటూ కూడా కామెంట్లు చేశారు. అయితే మేము ఆ ట్రోల్స్ ని పెద్దగా పట్టించుకోలేదు. సాధారణంగా చాలామందిలో ఇలాంటి మార్పులు జరుగుతూనే ఉంటాయి. కానీ నేను సహజ పద్ధతిలోనే బరువు తగ్గాను"అంటూ అలియా భట్ చెప్పుకొచ్చింది. ఇకపోతే ఆలియా భట్ లో వచ్చిన ఈ మార్పులను అటు కాజోల్ ఇటు ట్వింకిల్ కన్నా ప్రోత్సహించారు. ప్రస్తుతం మహిళలు తమ శరీరాలను ఏ పరిమాణంలోనైనా సరే ఆలింగనం చేసుకోవాలని.. అదే దిశగా తమను తాము ప్రోత్సహించుకోవాలని తెలిపారు. అటు ప్రజలు కూడా నువ్వు అలా చేయి.. నువ్వు ఏ పరిమాణంలో ఉండాలనుకుంటున్నావో అలాగే ఉండు.. అని నాతో కూడా చెప్పారు. ప్రస్తుత కాలంలో బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లిలో వచ్చే మార్పులను నిజంగా ఎవరూ పట్టించుకోరు. అది రిఫ్రెషింగ్ గా ఉంది అంటూ కూడా ఆలియా తెలిపింది. మొత్తానికైతే బరువు తగ్గడంపై వచ్చిన ట్రోల్స్ కి గట్టి కౌంటర్ ఇచ్చింది ఆలియా.




హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ కేసులో మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. దీనిపై కేటీఆర్ స్పందించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

**లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం..** "ఈ కేసులో ఏమీ లేదన్న విషయం అందరికి తెలుసు. నన్ను అరెస్టు చేసే ధైర్యం ప్రభుత్వం చేయదు. ఫార్ములా–ఈ కార్ కేసులో తప్పు చేయలేదని వంద సార్లు చెప్పా. లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధం. రాష్ట్రంలో కాంగ్రెస్, భాజపా జాయింట్ వెంచర్ ప్రభుత్వం నడుస్తోంది. దేశంలోనే ఇంత అక్రమ బంధం ఎక్కడా ఉండదు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే పరువు పోతుందని రాజీనామాకు అవకాశం ఇస్తున్నారు. దానం నాగేందర్‌తో రాజీనామా చేయిస్తారు. దానంతో రాజీనామా చేయిస్తామని మావాళ్లతో అన్నారు. సాంకేతిక సాకులతో కడియం శ్రీహరిని కాపాడే అవకాశం ఉందేమోనని చూస్తున్నారు" అని కేటీఆర్ అన్నారు.

**పెద్ద భూకుంభకోణానికి తెరలేపారు..** "పదేళ్లు నేను మంత్రిగా ఉన్నప్పుడు భూముల కోసం చాలా మంది వచ్చారు. డబ్బులు ఇస్తామన్నా కూడా భూమార్పిడికి మేం అంగీకరించలేదు. ఇవాళ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద భూకుంభకోణానికి తెరలేపింది. దీనికి కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. అజమాబాద్ భూముల క్రమబద్ధీకరణకు చట్టం తీసుకొచ్చాం. వంద శాతం రుసుముతో క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చాం. ఇతరుల చేతిలో ఉంటే 200 శాతం రుసుము పెట్టాం. ప్రభుత్వం ఇప్పుడు చౌకగా భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోంది. 9,292 ఎకరాలు ఎవరి సొత్తు అని సంతర్పణ చేస్తున్నారు? ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. 30 శాతం డబ్బులు చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తామంటున్నారు. భూముల విషయంలో న్యాయ పోరాటం చేస్తాం. కొనేవారు కూడా చిక్కుల్లో పడతారు జాగ్రత్త. భవిష్యత్‌లో వచ్చేది మా ప్రభుత్వమే. రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలో చిక్కితే కొనుగోలుదారులు నష్టపోతారు. %దీ=కా% హయాంలో ఇలాంటివి ఎప్పుడూ చేయలేదు. అధికారంలోకి వచ్చాక బాధ్యులను వదిలిపెట్టబోం. ఇది రూ.5 లక్షల కోట్ల విలువైన భూకుంభకోణం. రూ.50 వేల కోట్లు వెనకేసుకోవాలని రేవంత్ చూస్తున్నారు. భాజపా నేతలు కూడా ఈ భూకుంభకోణాన్ని అడ్డుకోవాలి" అని కేటీఆర్ అన్నారు.




ములుగు, నవంబర్ 21: గుప్త నిధుల తవ్వకాల్లో భారీగా బంగారం లభించింది. దానిని పంచుకునే క్రమంలో వారి మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో ఈ పంచాయితీ కాస్తా పోలీస్ స్టేషన్‌కు చేరింది. పోలీసులు రంగంలోకి దిగి.. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటన ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. ఆరు నెలల క్రితం కొందరు వ్యక్తులు బృందంగా ఏర్పడి.. మహారాష్ట్రలోని సిరిపంచ సమీపంలో ఒక ఇంట్లో గుప్త నిధుల కోసం భారీ ఎత్తున తవ్వకాలు జరిపారు. ఈ సందర్భంగా రాగి బిందెను వారు వెలికి తీశారు. అందులో భారీ ఎత్తున బంగారం లభ్యమైంది. దొరికిన ఆ బంగారాన్ని పంచుకునే క్రమంలో ఈ బృందంలోని సభ్యుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఒకరికొకరు ఘర్షణకు దిగారు. ఈ పంచాయతీ పోలీసులకు చేరింది. వీరి నుంచి మొత్తం సమాచారాన్ని సేకరించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. గుప్త నిధుల తవ్వకాల్లో దొరికిన రాగి బిందెపై పోలీసులు ఆరా తీశారు. ఈ తవ్వకాల్లో దొరికిన బిందెలో మొత్తం 36 బంగారం బిళ్లలు ఉన్నాయని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఒక్కో బిళ్ల 23 గ్రాముల బరువు ఉందని పోలీసులకు వారు వివరించినట్లు సమాచారం. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు.




హైదరాబాద్, నవంబరు21: తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పలువురు అధికారులకు తాజాగా పోస్టింగులు లభించగా.. మరికొంతమంది బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఇవాళ(శుక్రవారం) ఉత్తర్వులు జారీ చేసింది.

**బదిలీ అయిన అధికారులు వీరే...** 1. దేవేంద్ర సింగ్ చౌహాన్ అదనపు డీజీపీ.. మల్టిజోన్ -II నుంచి డీజీపీ ఆఫీస్ (పర్సనల్)కు బదిలీ. 2. పరిమల హనా నూతన్ జాకబ్ జాయింట్ కమిషనర్.. హైదరాబాద్ సిటీ నుంచి సీఐడీ డిప్యూటీ ఐజీగా బదిలీ. 3. చేతన మైలబత్తుల.. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీ నుంచి డిప్యూటీ డైరెక్టర్ RBVRR TGPA 4. నారాయణరెడ్డి.. వికారాబాద్ ఎస్పీ నుంచి మహేశ్వరం జోన్‌కు డీసీపీగా బదిలీ. 5. పద్మజ.. డీసీపీ మల్కాజిగిరి నుంచి ఎస్పీ (అడ్మిన్), యాంటీ నార్కొటిక్స్ బ్యూరో. 6. పాటిల్ సంగ్రామ్‌సింగ్ గణపత్రావ్.. ఎస్పీ సీఐడీ నుంచి నాగర్‌కర్నూల్ ఎస్పీగా బదిలీ. 7. ఖరే కిరణ ప్రభాకర్.. జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ నుంచి హైదరాబాద్ డీసీపీ సౌత్ జోన్‌కు బదిలీ. 8. చెన్నూరి రూపేశ్.. ఎస్పీ టీజీ యాంటీ నార్కోటిక్ నుంచి డీసీపీ SM&IT, హైదరాబాద్‌కు బదిలీ. 9. శబరీశ్, ఎస్పీ ములుగు నుంచి మహబూబాబాద్ ఎస్పీగా బదిలీ. 10. నితికా పంత్.. కమాండెంట్ రెండో బెటాలియన్ నుంచి కొమరంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా బదిలీ. 11. గిరిధర్.. వనపర్తి ఎస్పీ నుంచి యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు ఎస్పీ టీజీగా బదిలీ. 12. స్నేహా మెహ్రా.. డీసీపీ సౌత్ జోన్ నుంచి వికారాబాద్ ఎస్పీగా బదిలీ. 13. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా వైభవ్ గైక్వాడ్ 14. కేకన్ సుధీర్ రామనాథ్.. ములుగు ఎస్పీగా నియామకం. 15. సిరిసెట్టి సంకీర్త్.. గవర్నర్ ఏడీసీ నుంచి జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా బదిలీ. 16. పాటిల్ కాంతిలాల్ సుభాశ్.. గవర్నర్ ఏడీసీగా నియామకం. 17. బి.రామ్ రెడ్డి.. ఎస్పీ సీఐడీ నుంచి పెద్దపల్లి డీసీపీగా బదిలీ. 18. సి.శ్రీధర్.. ఎస్పీ ఇంటెలిజెన్స్ నుంచి మల్కాజిగిరి డీసీపీగా బదిలీ. 19. అవినాశ్ కుమార్.. SDPO నుంచి భద్రాద్రి కొత్తగూడెంకు అడిషనల్ ఎస్పీగా బదిలీ. 20. కాజల్.. SDPO నుంచి ఆదిలాబాద్‌కు అడిషనల్ ఎస్పీగా బదిలీ. 21. కంకనాల రాహుల్ రెడ్డి.. SDPO నుంచి భువనగిరి అడిషనల్ ఎస్పీగా బదిలీ. 22. శేషాద్రిని సురుకొంటి.. SDPO నుంచి రాజన్నసిరిసిల్లాకు అడిషనల్ ఎస్పీగా బదిలీ. 23. శివం ఉపాధ్యాయ.. SDPO నుంచి ములుగు అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్)గా బదిలీ. 24. భైంసా SDPOగా రాజేశ్ మీనా. 25. మౌనికా.. ASP నుంచి ఆదిలాబాద్‌కు అడిషనల్ ఎస్పీ అడ్మిషన్‌గా బదిలీ. 26. మనన్ భట్.. ఏఎస్పీ గ్రేహౌండ్స్ నుంచి ఏటూరునాగారం ఏఎస్పీగా బదిలీ. 27. పతిపాక సాయి కిరణ్.. ఏఎస్పీ గ్రేహౌండ్స్ నుంచి నిర్మల్‌కు ఏఎస్పీగా బదిలీ. 28. రుత్విక సాయి కొట్టే.. ఏఎస్పీ గ్రేహౌండ్స్ నుంచి వేములవాడ ఏఎస్పీగా బదిలీ. 29. యాదవ వసుందర ఫౌరెబి.. ఏఎస్పీ నుంచి సతుపల్లి, ఖమ్మంకు ఏఎస్పీగా బదిలీ. 30. ఎస్.శ్రీనివాస్.. వెయిటింగ్ లిస్ట్ నుంచి ఎస్పీటీజీ ట్రాన్స్‌కోలో నియామకం. 31. డి.సునీత.. వెయిటింగ్ లిస్ట్ నుంచి వనపర్తి ఎస్పీగా బదిలీ. 32. కె.గుణశేఖర్.. వెయిటింగ్ లిస్ట్ నుంచి రాచకొండ డీసీపీ క్రైమ్స్‌కు బదిలీ.




చేవెళ్ల: రంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. బీజాపూర్ హైవేపై మొయినాబాద్ మండలం కనకమామిడి పరిధిలోని తాజ్ డ్రైవ్ ఇన్ సమీపంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఈ ఘటనలో కొందరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు కార్లు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.




## దేశం గర్వించదగ్గ ఫిల్మ్ ఇండస్ట్రీ తెలంగాణలో ఉంది: గవర్నర్

హైదరాబాద్: ప్రసాద్ ఐమ్యాక్స్‌లో ఫిల్మ్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. తెలంగాణ నార్త్‌ఈస్ట్ కనెక్ట్‌లో భాగంగా రెండు రోజుల పాటు ఈ ఫెస్టివల్ జరగనుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాలు చాలా వైవిధ్యంతో కూడుకున్నవని అన్నారు. మణిపుర్, అస్సాంలో మంచి ఫిల్మ్ మేకర్స్ ఉన్నారని పేర్కొన్నారు. దేశం గర్వించదగ్గ ఇండస్ట్రీ తెలంగాణలో ఉందని కొనియాడారు.

## మంత్రి పొన్నం ఫోన్.. డ్రైవర్ బాలరాజు భావోద్వేగం




సిరిసిల్ల జిల్లా, నవంబర్ 21: జిల్లాలో కారుకు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. పెద్దాయనను కాలితో తన్నుతూ దాడి చేసిన కారు డ్రైవర్‌పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ దాడిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. దాడికి గురైన ఆర్టీసీ డ్రైవర్ బాలరాజుతో ఫోన్లో మాట్లాడారు.

ఈ సందర్భంగా బాలరాజు కంటతడి పెట్టుకున్నారు. మంత్రితో ఫోన్లో మాట్లాడుతూనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

**నా తప్పు లేదు సర్..** 'ఇన్నేళ్లుగా ఎలాంటి రిమార్క్ లేకుండా పని చేశా. బెస్ట్ డ్రైవర్‌గా అవార్డు కూడా అందుకున్నా సార్. నా తప్పు లేకున్నా నన్ను కొట్టాడు. తాగి వచ్చి తలపై కొట్టాడు... కాళ్లతో తన్నాడు' అంటూ బాలరాజు కన్నీటి పర్యంతమయ్యారు.

దీంతో ఆయనను ఫోన్లోనే ఓదార్చారు మంత్రి. ధైర్యంగా ఉండాలని.. దాడి చేసిన వ్యక్తిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డ్రైవర్‌కు మంత్రి పొన్నం భరోసా ఇచ్చారు.

## భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలి: రామచంద్రరావు

హైదరాబాద్ : భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. స్వదేశీ వస్తువులతో పాటు ప్రజల ఆలోచన కూడా స్వదేశీ వస్తువులని వినియోగించేలా ఉండాలని కోరారు. భారతదేశం ఇతర దేశాల వస్తువుల మీద ఆధారపడకూడదని ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇవాళ( శుక్రవారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బీజేపీ నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. నిన్న కాంగ్రెస్ యాంటీ ఇండియా ఐడియాలజీ ఉన్నవారికి ( ఇందిరా గాంధీ అవార్డు) ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. 2047 వరకు ఇండియా వికసిత్ భారత్ లక్ష్యంగా మనం ముందుకెళ్లాలని సూచించారు. చైనా, అమెరికా తమ ఉత్పత్తులను పెంచి.. ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు. భారతదేశంలో విదేశీ వస్తువుల వినియోగం పెరిగిందని చెప్పుకొచ్చారు. గతంలో మాదిరిగా ఇప్పుడు ఎవరి మీద భారతదేశం ఆధారపడే పరిస్థితి లేదని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ స్వదేశీ ఆయుధాలతో జరిగిందని.. అందుకే ఈ ఆపరేషన్ అంత సక్సెస్ అయ్యిందని రామచంద్రరావు పేర్కొన్నారు.



## జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ దేశానికి గర్వకారణం

హైదరాబాద్: జేఎన్‌టీయూ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజినీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. ISRO నుంచి Google, DRDO నుండి Tesla వరకు JNTU విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి గర్వకారణమన్నారు. విద్య ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడి అని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.



## స్పీకర్‌ను కలిసిన కడియం శ్రీహరి

హైదరాబాద్: ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు.




## బెట్టింగ్ యాప్ కేసులో సీఐడీ సిట్ దూకుడు.. విచారణకు హాజరైన హీరోయిన్లు

హైదరాబాద్, నవంబరు21: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో సీఐడీ సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ నేపథ్యంలో వీటిని ప్రమోట్ చేసిన పలువురు ప్రముఖులను విచారిస్తున్నారు. ఇవాళ(శుక్రవారం) విచారణకు హీరోయిన్లు నిధి అగర్వాల్, అమృత చౌదరి, యాంకర్ శ్రీముఖి హాజరయ్యారు. నిధి అగర్వాల్ జీత్ విన్ అనే బెట్టింగ్ సైటును ప్రమోట్ చేయగా.. శ్రీముఖి అనే యాప్ ను ప్రమోట్ చేశారు. M88 అనేది సాధారణంగా ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, కాసినో గేమ్స్ కోసం ఉపయోగించే అంతర్జాతీయ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌గా తెలుస్తోంది. యోలో 247, ఫెయిర్‌ప్లేలను అమృత చౌదరి ప్రమోట్ చేశారని వార్తలు వచ్చాయి. విచారణకు హాజరైన వారిని అధికారులు పలు ప్రశ్నలు అడుగుతున్నట్లు సమాచారం. బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేయడానికి గల కారణాలపై సీఐడీ సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు.

ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, బెట్టింగ్ యాప్ యాజమాన్యాలతో చేసుకున్న అగ్రిమెంట్ వివరాలను సీఐడీ సిట్‌కి అందజేశారు నిధి అగర్వాల్, శ్రీముఖి, అమృత చౌదరి. సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లపై గతంలో మియాపూర్, పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో మొత్తం 29 మందిపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఇప్పటికే విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి , ప్రకాశ్‌రాజ్, యాంకర్ విష్ణుప్రియ , సిరి హనుమంతులను విచారణ చేశారు సీఐడీ సిట్ అధికారులు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com